ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 30.10.2026 | సంపుటి:13 సంచిక : 100 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి , మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ సీఎస్ వివిధ దేశాల పారిశ్రామిక వేత్తలు

రైజింగ్‌లో భాగస్వాములు కండి

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది

- ఆర్ఆర్ఆర్ తెలంగాణ గేమ్ ఛేంజర్
- వికసిత్ భారత్ లక్ష్యానికి అంతా కలిసి పనిచేయాలి
- పెట్టుబడుల సాధనలో రాష్ట్రం ముందు వరుసలో ఉంది
- ఢిల్లీ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాల దిశగానే తెలంగాణ సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో 10 శాతాన్ని తెలంగాణ కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దిల్లీలో తాజ్ ప్యాలెస్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై పెట్టుబడిదారులను ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మిగతా 2లో..

తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అభినందిస్తున్నా

- తాజ్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సులో పీయూష్ గోయల్
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అభినందిస్తున్నట్టు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమిట్ కోసం దిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సులో పీయూష్ గోయల్ మిగతా 2లో..

'చలో దిల్లీ రామ్‌లీలా మార్చ్'ను నిర్వహిస్తున్నాం. ఇది ఏ రాజకీయ పార్టీకి చెందిన ర్యాలీ కాదు. నరేంద్రమోదీ అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌తో విసిగిపోయిన ప్రజలంతా ఈ నిరసన ర్యాలీలో పాల్గొనచ్చు. పోలీసులు, లాఠీ ఛార్జీలకు భయపడొద్దు. మాతో కలిసి రండి. రాజ్యాంగాన్ని, భారత జాతిని కాపాడేందుకు మనందరం కలిసి నడుద్దాం. ఇది దేశయాత్ర.. ఇది మీ యాత్ర" – రాహుల్ గాంధీ

ప్రజాస్వామ్య పరిరక్షణకు చలో ఢిల్లీ

విజయవంతం చేయండి

లాఠీలకు భయపడొద్దు • 'రామ్‌లీలా మార్చ్'పై వెనక్కి తగ్గని రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న ఇండియా కూటమి తలపెట్టిన నిరసనలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. దీపావళి పండగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్చ్‌ను వాయిదా వేసుకోవాలని స్థానిక వ్యాపార సంఘాలు అభ్యర్థిస్తున్నా.. ఆయన ర్యాలీ నిర్వహణకే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించాలనుకునే వారంతా మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు."ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ఓటు చోరీని అడ్డుకునేందుకు, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు 'చలో దిల్లీ రామ్‌లీలా మార్చ్'ను నిర్వహిస్తున్నాం. ఇది ఏ రాజకీయ పార్టీకి చెందిన ర్యాలీ కాదు. నరేంద్ర మోదీ అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌తో విసిగిపోయిన ప్రజలంతా ఈ నిరసన ర్యాలీలో పాల్గొనచ్చు. పోలీసులు, లాఠీ ఛార్జీలకు భయపడొద్దు. మాతో కలిసి రండి. రాజ్యాంగాన్ని, భారత జాతిని కాపాడేందుకు మనందరం కలిసి నడుద్దాం. ఇది దేశయాత్ర.. మిగతా 2లో..

తెలంగాణలో 'సర్' గడువు

పొడిగింపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గడువును పొడిగిస్తూ ఈ షెడ్యూల్‌ను సవరించింది. సవరించిన షెడ్యూల్‌పై తాజాగా ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది.



ప్రపంచంపై ఎల్‌నినో పడగ

విపత్తు ప్రభావంతో మార్చినాటికి భారత్‌లో 55వేల మరణాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రపంచంపై ఎల్‌నినో పడ గవిప్పింది. దాంతో ఒకచోట కరవు, ఇంకోచోట వరదలు, తుపానుల వంటి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. పెరుగుతోన్న ఉష్ణోగ్రతల కారణంగా మిగతా 2లో..

కరువు కాలంలో

మూసీ పునరుజ్జీవనమెందుకు?

- డీపీఆర్‌లేకుండా ఎలా ప్రారంభిస్తారు?
- సీఎం రేవంత్ వల్లే రాష్ట్రంలో కరవు
- ఏపీలో లోటు వర్షపాతం ఉన్నా వచ్చిన నీళ్లను చంద్రబాబు ఒడిసిపట్టుకున్నాడు
- ఆయనను అభినందిస్తున్నా: కేటీఆర్
- మూసీ సుందరీకరణ పేరుతో రూ.1.50 లక్షల కోట్ల లూటీకి సిద్ధమయ్యారని విమర్శ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఉన్నా ఏపీలో కరవు లేదు. చంద్రబాబు ముందు చూపుతో నీళ్లు ఎత్తిపోసుకున్నారు. నీళ్లు ఎత్తిపోసుకోవడం వల్లే ఏపీలో కరవు, క్రాప్‌హాలిడే లేవు. ఈ విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నా" అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణలో లోటు వర్షపాతం 17 నుంచి 20 శాతం మాత్రమే ఉందని, సీఎం రేవంత్ వల్లే రాష్ట్రంలో కరవు వచ్చిందన్నారు. "కరవుపై రేవంత్‌రెడ్డి అవాస్తవాలు చెబుతున్నారు. తీవ్రమైన కరవులో ఉన్నామని చెబుతూనే.. మూసీ సుందరీకరణ ఎందుకు? మూసీ పేరుతో రూ. 1.50 లక్షల కోట్ల లూటీకి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మిగతా 2లో..

కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు

చింతిస్తున్నా

: కొండా సురేఖ

ఆ 550 ఎకరాలు

ప్రభుత్వానివే..

మియాపూర్‌లో భూముల కేసులో సుప్రీం కీలక తీర్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లో భూ వివాదంపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఈ రెండు సర్వే నెంబర్లలో 550ఎకరాల భూమి తమదేనంటూ కొందరు గతంలో ఆక్రమించే ప్రయత్నం చేశారు. అయితే.. 2003లో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులోప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను ఇవాళ సుప్రీంకోర్టు కొట్టివేసింది. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమి పరిరక్షణకు చూపిన ప్రత్యేక చొరవను కోర్టు అభినందించింది.వాస్తవానికి మియాపూర్ భూములకు సంబంధించి, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ తీసుకున్న నిర్ణయాన్ని 2003లోనే ఉమ్మడి హైకోర్టు సమర్థించింది. ఈ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా ఇతరుల నుంచి మిగతా 2లో..

డిజిటల్ మోసాలతో డబ్బుకొట్టేస్తే

బ్యాంకులదే బాధ్యత

నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి
విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు.. సుప్రీంకోర్టు ఆందోళన

100 శాతం ఇథనాల్‌కు అనుమతిస్తే

అంత ఇంధనాన్ని ఎక్కడనుంచి తెస్తారు?

కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్న

ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, లబ్ధిదారుల వివరాలను

బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేం

సుప్రీంకోర్టు వార్త 2 లో

నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు

'పానీ'

జలమండలి ప్రత్యేక యాప్..

ఆవిష్కరించిన మంత్రి పొన్నం

హైదరాబాద్(జనంసాక్షి): నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు హైదరాబాద్ జలమండలి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా " పానీ" యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. జల మండలి సిబ్బంది ద్వారా అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షణ సాధ్యం కాదని, అందుకే ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్టు చెప్పారు. 'పానీ' యాప్ ద్వారా ప్రతి పౌరుడు 'సేవ్ వాటర్ వలంటీర్'గా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు.నీటి దుర్వినియోగంపై ఫిర్యాదు చేసే వలంటీర్లు కూడా జలసంరక్షణ మిగతా 2లో..

మల్లన్నసాగర్‌ను కూల్చాలని కుట్ర చేస్తున్నారా?

- రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి:హరీశ్‌రావు
- దీన్ని తక్షణమే ఆపేయాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గజ్వేల్(జనంసాక్షి):మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో అనుమతులు లేకుండా బాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. పేలుళ్లతో కట్టకు ప్రకంపనలు వస్తున్నాయని, సమీపంలోని ఇళ్లకు మిగతా 2లో..

ఇరాన్‌పై దాడులు ఉండొచ్చు

సిద్ధంగా ఉండండి • మిత్రదేశాలకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతలు ఇంకా తీవ్రరూపం దాల్చేలా కనిపిస్తున్నాయి. నవంబర్ 3న జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల తర్వాత ఇరాన్‌పై దాడులు ఉండొచ్చని అమెరికా నుంచి సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పశ్చిమాసియాలోని మిత్రదేశాలకు అగ్రరాజ్యం హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై కొత్తగా సైనికదాడులు చేసే అవకాశం ఉందని, అందుకు సిద్ధంగా ఉండాలని అమెరికా చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు ఇద్దరు దౌత్యవేత్తలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మిగతా 2లో..

రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు

మరింత తీవ్రం

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మాస్కో డ్రోన్ దాడి..

ఘటనలో 13 మంది మృతి

కీవ్(జనంసాక్షి):రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌లోని ఓ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మాస్కో దళాలు డ్రోన్ దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో 13 మంది మరణించారు. దినిప్రో రైల్వేస్టేషన్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. జపోరిజియాకు వెళ్తున్న రైలు.. దినిప్రో స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉండగా మిగతా 2లో..

'అర్నబ్' భయం వీడకముందే

పొంచి ఉన్న మరో ముప్పు

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

అమరావతి(జనంసాక్షి): అర్నబ్ తుపాను సృష్టించిన విధ్వంసం మరువక ముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. బుధవారం దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం ఉదయం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణశాఖ తెలిపింది. 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న అండమాన్-నికోబార్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

'అర్నబ్'తో ఆంధ్రా కకావికలం

తుపానుతో ముంచెత్తిన బాహుదా..

- భారీ వరదతో చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు
- పొంగుతున్న వాగులు.. జోలాపుట్ నుంచి నీటి విడుదల అధికారుల అప్రమత్తత వల్లే
- ప్రాణ నష్టం తగ్గింది: ముఖ్యమంత్రి చంద్రబాబు

బాహుదా నది ఉప్పొంగడంతో భారీ వరదతో చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు

అమరావతి(జనంసాక్షి):అర్నబ్ తుపాను శ్రీకాకుళం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. భారీ వర్షాలతో పాటు ఎగువన ఒడిశాలోని భగలట్టి డ్యామ్ గేట్లు ఎత్తడంతో బాహుదా నది ఉగ్రరూపం దాల్చింది. చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో ఇచ్ఛాపురం మండలంలో రాకపోకలు స్తంభించాయి. హైవేపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
30.10.2026

కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా: కొండా సురేఖ

వరంగల్(జనంసాక్షి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో తాను చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో తానలా మాట్లాడానన్నారు. నిరాధారమైన ఆ వ్యాఖ్యలు చేసి ఉండకూడదన్నారు. కేటీఆర్, కుటుంబసభ్యులను బాధ పెట్టాలని.. వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేదన్నారు. తన వ్యాఖ్యలతో కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులను నొప్పించి ఉంటే చింతిస్తున్నానని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని కొండా సురేఖ అన్నారు.

కరువు కాలంలో మూసీపునరుజ్జీవనమెందుకు?

ఏం జరుగుతుందో రాహుల్ గాంధీకి ఏమైనా తెలుస్తోందా. రాష్ట్రం ఓవైపు కరవుతో అల్లాడుతుంటే.. మూసీ సుందరీకరణ చేపడుతున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారు

మాజీ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఇంకా చూడలేదని, చూశాక లీగల్ టీమ్‌తో చర్చిస్తానని చెప్పారు. నిజం నిలకడ మీద తేలుతుందని పెద్దలు ఎప్పుడో చెప్పారు.. ఇంకా క్షమాపణలు చెప్పేవాళ్లు చాలా మంది ఉన్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ దూది పింజల్లా తేలిపోతాయన్నారు.

ఎన్నికలను 'అరబ్ పార్టీలు' కొల్లగొట్టాయి: నెతన్యాహు

టెల్‌అవీవ్(జనంసాక్షి): ఇజ్రాయెల్‌లో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి అరబ్ పార్టీలపై ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయని, అరబ్ పార్టీలకు అనుకూలంగా ఓటర్లకు లంచాలు ఇచ్చాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీ చీఫ్ కోరిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఈ వ్యవహారాన్ని పెను భూకంపంగా పేర్కొన్న ఆయన.. దీనిపై పోలీసులు, దేశ అత్యున్నత అంతర్గత భద్రతా సంస్థలు తక్షణమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు."యునైటెడ్ అరబ్ లిస్ట్, జాయింట్ లిస్ట్ కూటములు ఎన్నికలను కొల్లగొట్టాయి. ఇటీవలి ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ పార్లమెంటును స్వాధీనం చేసుకోవడం, మితవాద పాలనను అంతం చేయడమే వాటి లక్ష్యం. ఒకవేళ అటువంటి ప్రభుత్వం ఏర్పడితే దేశానికే ప్రమాదం. ఇరాన్ విషయంలో ఇజ్రాయెల్ బలగాలు వెనకడుగు వేయడానికి దారితీయొచ్చు. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ఏ జియోనిస్ట్ పార్టీ కూడా ఆ రెండు కూటములకు సహకరించకూడదు" అని నెతన్యాహు 'ఎక్స్'లో పేర్కొన్నారు.ఇజ్రాయెల్‌లో ఏ పార్టీకీ మెజారిటీ దక్కే అవకాశం కనిపించడం లేదు. ప్రాథమిక కౌంటింగ్ అంచనాల ప్రకారం.. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 53 సీట్లు, మాజీ సైన్యాధిపతి గడీ ఐసెన్‌కోట్ సారథ్యంలోని ప్రతిపక్ష పార్టీ 48 సీట్లను గెలుచుకునే అవకాశముంది. అరబ్ పార్టీలకు 19 సీట్లు దక్కుతాయని అంచనా. 120 సీట్లు ఉన్న పార్లమెంటు నెస్సెట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 61 సీట్లు ఉండాలి.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రెండు కొత్త విమానాశ్రయాలను కేంద్రం మంజూరు చేసిందని వివరించారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.దేశంలో, హైదరాబాద్‌లో ఏరోస్పేస్ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ బీజం వేశారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ప్రధాని పీవీ నరసింహారావు దేశంలో ఎల్పీజీ సంస్కరణలు ప్రవేశపెట్టారని పునరుద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన పీవీ తెలంగాణ వ్యక్తి కావటం గర్వకారణమని అన్నారు. హైదరాబాద్ చుట్టూ ఆర్ఆర్ఆర్ నిర్మిస్తామని కేంద్రం ఇప్పటికే హామీ ఇచ్చిందని, అది హైదరాబాద్‌కు మరో గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు.అన్ని రాష్ట్రాలు కలిసివస్తేనే దేశ ఎగుమతులు పెరుగుతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తెలంగాణ నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని అభినందించిన కేంద్రమంత్రి బలంగా కృషి చేస్తే అనుకున్నది సాధించవచ్చని అన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి భారతీయులంతా కలిసి పని చేయాలని ఈ సూత్రాన్నే ప్రధాని మోదీ తమకు సూచించారని పీయూష్ గోయల్ వెల్లడించారు. ప్రధాని మోదీ మాకు ఇచ్చిన మార్గదర్శకత్వం ఇప్పటికీ తన మదిలో మెదులుతూనే ఉందన్నారు.

పెట్టుబడుల సాధనలో ముందు వరుసలో ఉంది

కొత్త రాష్ట్రమైనా పెట్టుబడుల సాధనలో తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉందని భారత్ బయోటెక్ సీఎండీ సుచిత్ర ఎల్లా అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్‌రైజర్ సమావేశంలో మాట్లాడిన ఆమె పెట్టుబడుల సాధన కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్న ఆమె హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ నుంచే కరోనా టీకా కోవాగ్జిన్ వచ్చిందని గుర్తుచేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లోనూ..హైదరాబాద్ తనదైన ముద్ర వేస్తోందని చెప్పారు. ఎయిర్‌క్రాఫ్ట్, స్పేర్‌పార్ట్స్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించి హైదరాబాద్‌లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు శక్తిమంతమైన వేదిక కానుందన్న ఆమె తెలంగాణ, హైదరాబాద్‌లో వ్యాపార అవకాశాల్లో నిరుత్సాహం అనేది ఉండ దన్నారు.

తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అభినందిస్తున్నా

మాట్లాడారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తామనే ధీమాతో ఉన్నారు, బలంగా కృషి చేస్తే అనుకున్నది సాధించవచ్చన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. తమ ఆశయాలు, లక్ష్యాలను అన్ని రాష్ట్రాలు ఒక వేదికపై తప్పక వెల్లడించాలి. తాండూరు కందిపప్పు జియోట్యాగింగ్ సాధించింది. తెలంగాణ నుంచి ఆస్ట్రేలియాకు 2.5 మెట్రిక్ టన్నుల తాండూరు కందిపప్పు ఎగుమతి అవుతోంది. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్రంలో అనేక పరిశ్రమలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. పీఎం మిత్ర కింద కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు ప్రధాని శ్రీకారం చుట్టారు. దేశాభివృద్ధి.. రాష్ట్రాల అభివృద్ధితోనే ముడిపడి ఉంది. నిజామాబాద్ పసుపు ఉత్పత్తికి ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. మన ఉత్పత్తులకు మరింత బ్రాండ్, వాల్యూ కల్పించుకోవాలి" అని కేంద్రమంత్రి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సులో పాల్గొన్నారు.

ప్రపంచంపై 'ఎల్‌నినో' పడగ

వాతావరణ నిపుణులు దీనిని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్ విడుదల చేసిన గణాంకాలు మరింత భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ అసాధారణ వాతావరణ మార్పు వల్ల సాధారణంగా వేసవిలో సంభవించే మరణాల కన్నా ప్రపంచవ్యాప్తంగా అదనంగా 3,73,000 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రానున్న ఆరు నెలల్లో ఈ మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది.గ్లోబల్ సౌత్ దేశాల్లో విపరీతమైన వడగాలులు, వేడి సంబంధిత మరణాలు ఎక్కువగా ఉండొచ్చని మోర్టాలిటీ ట్రాకర్ నివేదిక హెచ్చరించింది. భారత్‌పై కూడా ఎల్‌నినో ప్రభావం గట్టిగానే ఉంటుందని, అక్టోబర్ నుంచి మార్చి మధ్యలో 55వేల మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. అత్యధిక మరణాలు మార్చి నెలలోనే నమోదు కావొచ్చని వెల్లడించింది. నైజీరియాలో 56వేలు, ఇండోనేషియాలో 29వేలు, బ్రెజిల్‌లో 19వేల చొప్పున మరణాలు ఉండొచ్చని పేర్కొంది. 1950 తర్వాత ఈసారే అత్యంత బలమైన ఎల్‌నినో ఏర్పడిందని, దీని ప్రభావం 2027లోనూ కొనసాగుతుందని ఇప్పటికే ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది.ఎల్‌నినో ప్రభావంతో ప్రాణనష్టాన్ని అంచనా వేయడానికి క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ ఈ మోర్టాలిటీ ట్రాకర్‌ను రూపొందించింది. "తీవ్రమైన వేడి ప్రభావాలను ముందుగానే గుర్తించడం ఉన్నంతలో మంచి విషయం. దీనివల్ల ప్రజలకు ఎక్కువ ప్రమాదం ఎక్కడ ఉందో గుర్తించి, ప్రాణనష్టం జరగకముందే నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది" అని ఈ ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు మైఖెల్ గ్రీన్‌స్టోన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. అభివృద్ధి చెందుతున్న, వెనకబడిన దేశాలను గ్లోబల్ సౌత్‌గా చెప్తుంటారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో ఈ దేశాలు ఎక్కువగా ఉంటాయి. తలసరి ఆదాయం అంతంతమాత్రంగా ఉండటం, పేదరికం, మౌలిక సదుపాయాల లేమితో పాటు ప్రధానంగా వ్యవసాయంపైనే ఈ దేశాలు ఆధారపడుతుంటాయి.

ప్రజాస్వామ్య పరిరక్షణకు చలో ఢిల్లీ విజయవంతం చేయండి

ఇది మీ యాత్ర" అని రాహుల్ రాసుకొచ్చారు.దీపావళి పండగ సీజన్‌లో దిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' పేర్కొంది. అయితే, నవంబరు 1న చేపట్టే నిరసన కారణంగా రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని సీటీఐ, వ్యాపార సంఘాలు కోరుతున్నాయి. ఈ అభ్యర్థనలపై రాహుల్ ఇప్పటికే స్పందించారు. "మీ సమస్యలు మాకు అర్థమవుతున్నాయి. అయితే.. మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితంగా ఉండదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" అని కాంగ్రెస్ ఎంపీ వెల్లడించిన సంగతి తెలిసిందే.

నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు 'పానీ'

చేసినట్లేనన్నారు. సమాజం బాగుండాలనుకునే ప్రతి వ్యక్తి నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడినప్పుడు ఎవరూ జల సంరక్షణ చేయట్లేదని, భూగర్భ జలాలు పెంచుకునే అవసరం, బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫైన్‌లు వేసి ప్రజలను వేధించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, నీటి పొదుపుపై అవగాహన కల్పించడమే ముఖ్యమని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిమ్స్‌లో అవినీతి ఆరోపణలు..

హైదరాబాద్(జనంసాక్షి): పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ డీఎస్పీ లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 10 మంది అధికారులు నిమ్స్ పరిపాలనా విభాగంలో రికార్డులను పరిశీలించారు. మరోవైపు ఆసుపత్రి క్యాంటీన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు, సర్జికల్ స్టోర్‌లో నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహించారు. మందులు, వైద్య పరికరాల నిల్వలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. మెడికల్ స్టోర్లు, సర్జికల్ స్టోర్లు, క్యాంటీన్‌కు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ తనిఖీల్లో కీలక రికార్డులను పరిశీలిస్తూ, అవసరమైన పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు.

రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు మరింత తీవ్రం

ఈ డ్రోన్ దాడి చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంది. ఎయిర్ సైరన్లు మోగినా.. దాడి గురించి హెచ్చరించినా ప్రయాణికులు పట్టించుకోలేదని, దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉందని స్థానిక అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 13 మంది మరణించగా.. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. భద్రతా సిబ్బంది తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు.ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ రష్యాపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రష్యా సంపన్నులు, ఆ దేశ ఇంధన రంగంపై పశ్చిమ దేశాలు ఆంక్షలు ఎత్తివేయగానే.. మాస్కో తమపై తీవ్రంగా విరుచుకుపడుతోందని ఆరోపించారు. ఇకనైనా ఆ దేశంపై మళ్లీ కఠిన ఆంక్షలు తీసుకొచ్చి.. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని నిలువరించాలని ఈయూ, అమెరికా, జీ7 కూటమిని కోరారు.

'అర్నబ్'తో ఆంధ్రా కకావికలం

లొద్దపుట్టి, పేటూరు సహా వివిధ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బాహుదా వరద విలయాన్ని డ్రోన్ దృశ్యాల్లో చూడొచ్చు.

పొంగుతున్న వాగులు.. జోలాపుట్ నుంచి నీటి విడుదల

అల్లూరి జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పాడేరు మండలం పరదానిపుట్టు వాగు పొంగడంతో మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. జోలాపుట్ జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో మచ్‌కుండ్ జల విద్యుత్తు కేంద్రంలోకి వరద నీరు చేరింది. టర్బైన్లలో నిలిచిన నీటిని సిబ్బంది తొలగించారు. అనంతరం జోలాపుట్ నీటి విడుదల సామర్థ్యాన్ని 23 వేల క్యూసెక్కులకు అధికారులు తగ్గించారు.

ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలోకి చేరిన బాహుదా వరద

శ్రీకాకుళం, ఇచ్ఛాపురం గ్రామీణం: 'అర్నబ్' తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులకు వరద పోటెత్తింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదుల్లోకి భారీగా వరదనీరు చేరడంతో పదుల సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎగువన ఒడిశాలోని భగలట్టి డ్యామ్ వద్ద గేట్లు ఎత్తివేయడంతో పాటు భారీ వర్షాలతో ఇచ్ఛాపురం మండలంలో బాహుదా నది ఉగ్రరూపం దాల్చింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా నదిలో వరద ప్రవహిస్తోంది. బాహుదా నదికి మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. చెన్నై-కోల్‌కతా హైవే పైకి భారీగా వరద చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లొద్దపుట్టిలో నడుము లోతు వరద ప్రవహిస్తుండంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. సోంపేట మండలం లక్కవరం పరిసరాల్లో భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. జిల్లాలోని నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. నేడు కూడా జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హిరమండలంలో గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నదిలోకి వస్తున్న వరదను అధికారులు దిగువకు పంపిస్తున్నారు. మహేంద్ర తనయ నదిలోనూ వరద పెరుగుతోంది. పాతపట్నం మండలం చంగుడి, కె.గోపాలపురం, అచ్యుతాపురం గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది.తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో ఇచ్ఛాపురం- సోంపేట మధ్య రైల్వేట్రాక్ పైకి భారీగా వరదనీరు చేరింది. ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. బరంపురం-విశాఖ (18525), విశాఖ-బరంపురం (18526), విశాఖ-భువనేశ్వర్ (22820) రైళ్లు రద్దయ్యాయి. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం ప్రయాణికులు 08942 286213, 08942 286245 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

అప్రమత్తత వల్లే ప్రాణ నష్టం తగ్గింది: సీఎం చంద్రబాబు

కోనసీమ: గత తుపానులను దృష్టిలో పెట్టుకుని పనిచేశాం, అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఏరియల్ సర్వే నిర్వహించారు. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. " అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశాం. అధికారుల అప్రమత్తతతో ప్రాణ నష్టం తగ్గింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. మారుమూల ప్రాంతాలకు వెళ్లాలన్నా ఎక్కడా అడ్డంకులు లేకుండా.. రహదారులపై కూలిన చెట్లన్నీ తొలగించాం. టెలి కమ్యూనికేషన్‌లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి.దాదాపు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం. వెయ్యి మంది విద్యుత్ సిబ్బందిని పంపించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాం. తెలంగాణ ప్రభుత్వం కూడా సాయం చేసేందుకు ముందుకొచ్చింది.

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా?

పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసి, కట్ట భద్రతపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు వంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలో పేలుళ్లు జరపాల్సి ఉండగా, 200 మీటర్ల దూరంలోనే జరుగుతున్నాయని మండిపడ్డారు. రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

రైతులతో కలిసి ఉద్యమిస్తాం

మల్లన్నసాగర్ భూసేకరణలో అసైన్డ్ భూముల రైతులకు తక్కువగా, పట్టా భూముల రైతులకు ఎక్కువగా పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్షించి న్యాయం చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.తిప్పారం గ్రామం వద్ద పైప్‌లైన్ల పనుల కోసం జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతిన్నాయని, మల్లన్నసాగర్ కట్టకూ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌తో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు దెబ్బతిన్నవారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇరాన్‌పై దాడులు ఉండొచ్చు

మీడియా కథనాలు వెల్లడించాయి.ఈ దాడులు కొన్నిరోజుల పాటు కొనసాగొచ్చని తెలుస్తోంది. అయితే, ఈ సరి కొత్త సైనిక చర్య గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కానీ, మిడ్‌టర్మ్ ఎన్నికల తర్వాత ఇరాన్‌పై దాడులకు ఆదేశాలు ఇచ్చే విషయాన్ని తాను పరిశీలిస్తున్నానని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు.ఈ సంకేతాలకు తగ్గట్టుగా అమెరికా ముందుకు వెళితే.. గల్ఫ్ దేశాల్లోని మౌలిక సదుపాయాలపై ఇరాన్ విరుచుకుపడే అవకాశం ఉంది.

డిజిటల్ మోసాలతో డబ్బుకొట్టేస్తే బ్యాంకులదే బాధ్యత

న్యూఢిల్లీ(జనంసాక్షి):డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు.డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్?పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే..

చట్టబద్ధంగా పొందామని, తమ సనద్' హక్కులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని పార్థ సారథి, సువిశాల్ జైన్‌లు కోర్టును అభ్యర్థించారు. రిజిస్టర్డ్ పత్రాలను రద్దు చేసే అధికారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు లేదని కోర్టులో వాదించారు. ఈవాదనలపై ప్రభుత్వ న్యాయవాదులు కూడా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. జాగీర్దార్ ఖైసరుద్దీన్‌కు అప్పట్లోనే పరిహారం చెల్లించినందున ఈ భూములపై ఎలాంటి హక్కులను క్లెయిమ్ చేసే అవకాశం వారసులుగా చెబుతున్న వారికి లేదని స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా అనుమతించబోమని, ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

100 శాతం ఇథనాల్‌కు అనుమతిస్తే అంత ఇంధనాన్ని ఎక్కడనుంచి తెస్తారు?

న్యూఢిల్లీ(జనంసాక్షి):వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతిస్తే.. దానికి అవసరమైన ఇంధన సరఫరాను ఎలా చేపడతారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో ఇ100 వినియోగానికి కేంద్రం ఇటీవల అనుమతి ఇవ్వడం, మరోవైపు.. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే ప్రణాళిక లేదని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురీ పేర్కొన్న నేపథ్యంలో.. సుప్రీం వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2025-26 ఇథనాల్ సప్లై ఇయర్ కు ఇథనాల్ కేటాయింపులకు సంబం ధించిన పిటిషన్లను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలే ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాల అంశంపై ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలను ప్రస్తావించింది. 100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే.. దానికి అవసరమైన ఇంధన సరఫరాను ఎలా సమకూర్చుతారని ప్రశ్నిం చింది. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి స్పందిస్తూ.. దీని కోసం భారీ స్థాయిలో తయారీ వ్యవస్థల్లో మార్పులు చేయాల్సి ఉంటుందని చెప్పారు."ఈ అంశంలో విస్తృత ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. పర్యావరణ కోణంలోనూ పరిశీలించాల్సి ఉందని అన్నారు.

ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని ఆదేశించలేం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, వాటి అసలు లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ఒటిఐ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ డి.కె.ఉపాధ్యాయలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఒక ఎంపీగా ఈ అంశాన్ని పార్లమెంటులో ఎందుకు లేవనెత్తలేదని, అక్కడ ఎందుకు చర్చ కోరలేదని ధర్మాసనం ప్రశ్నించింది. పెట్టుబడిదారుల వివరాలను బహిర్గతం చేయటానికి ప్రస్తుతం చట్టపరమైన వ్యవస్థ కానీ ఫ్రేమ్‌వర్క్ లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం కోర్టు ఒక కొత్త నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించాల్సి ఉంటుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తనకు ఉన్న అధికార పరిధిని ఉపయోగించి కోర్టు అలాంటి పనిని చేయలేదని చెప్పింది. అయినా సెబీకి ఆదేశాలు ఇవ్వొచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ ఫండ్స్ వెనక ఉన్న అసలు వ్యక్తులు కంపెనీల షేర్ల విలువను అమాంతం పెంచి అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల అసలు లబ్ధిదారుల వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. కంపెనీల్లో జరుగుతున్న భారీ పెట్టుబడుల వెనుక ఎవరున్నారో తెలుసుకునే హక్కు సాధారణ పెట్టుబడిదారులకు ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశీ సంస్థల ద్వారా అస్పష్టమైన మార్గాల్లో పెట్టుబడులు వచ్చినప్పుడు ఇది మరింత ముఖ్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. అపారదర్శక ఆర్థిక సాధనాల ద్వారా స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అనేది సెక్యూరిటీ మార్కెట్లను నియంత్రించే సంస్థ అని, ఏఐఎఫ్, ఎఫ్‌పీఐల కార్యకలాపాలను పర్యవేక్షించడం దాని బాధ్యత అని పేర్కొన్నారులబ్ధిదారుల వివరాలను వెల్లడించడం అవసరమని కోర్టు భావిస్తే, మార్కెట్‌లోని పెట్టుబడుల వెనుక ఎవరున్నారో పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఆదేశించవచ్చని భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ సమస్య కేవలం సెబీ వద్ద సమాచారం ఉండటం లేదా లేకపోవడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. షేర్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారు, విక్రయిస్తున్నారు? ఆ పెట్టుబడుల వల్ల అంతిమంగా ఎవరు లబ్ధి పొందుతున్నారు అనే విషయాలు పౌరులు తెలుసుకోగలిగేలా ఆ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి కోమటిరెడ్డి అండ

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి వెంకట్‌రెడ్డి
- ఈనాడు జర్నలిస్ట్ దివంగత దత్తురెడ్డి భార్య ప్రియాంకకు న్యాక్‌లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగం
- సంగారెడ్డిలో ఉద్యోగ అవకాశం కల్పించిన మంత్రి.. ఉద్యోగాన్ని పర్మినెంట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఒక కుటుంబానికి కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడటమే కాదు..మానవీయకోణంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భరోసాగా నిలిచారు. అందులో భాగంగానే దివంగత ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి కుటుంబానికి అండగా నిలిచి, గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. గతేడాది ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కామారెడ్డి జిల్లాలోని దత్తురెడ్డి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ క్లిష్ట సమయంలో కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు, తక్షణ సాయంగా రూ.4 లక్షలు అందజేశారు. అంతటితో తన బాధ్యత ముగిసిందని భావించకుండా.. కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. దత్తురెడ్డి భార్య ప్రియాంకకు తన శాఖ పరిధిలో ఉద్యోగం కల్పిస్తానని నాడు హామీ ఇచ్చారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి, తాజాగా ప్రియాంకకు న్యాక్‌లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా సంగారెడ్డిలో ఉద్యోగ అవకాశం కల్పించారు. అంతేకాకుండా, ఆమె ఉద్యోగాన్ని పర్మినెంట్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రియాంకకు భవిష్యత్తులోనూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. తమ కష్టకాలంలో అండగా నిలిచి, ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రియాంకతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కోమటి రెడ్డి చూపిన మానవత్వం, జర్నలిస్టు కుటుంబం పట్ల ఆయన తీసుకున్న చొరవపై పలువురు జర్నలిస్టులు సైతం ధన్యవాదాలు తెలిపారు. కష్టాల్లో ఉన్న జర్నలిస్ట్ కుటుంబానికి భరోసా కల్పిస్తూ, ఒక కుటుంబ భవిష్యత్తుకు అండగా నిలవడం అభినందనీయమని వారు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ చైతన్య స్కూల్ నిర్లక్ష్యం

- విద్యార్థికి గాయం పట్టించుకోని స్కూల్ యజమాన్యం
- విద్యార్థి తండ్రితో దురుసుగా ప్రవర్తించిన స్కూల్ ప్రిన్సిపల్

మొయినాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ఓ విద్యార్థి పాఠశాలలో ఆడుకుంటూ కింద పడిపోవడంతో విద్యార్థితలకు రక్త గాయం అయింది. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య స్కూల్లో జరిగింది. ఈ మేరకు విద్యార్థి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. కనకమామిడి గ్రామానికి చెందిన క్యామ రవీందర్ కొడుకు విహార్ శ్రీ చైతన్య స్కూల్లో మూడవ తరగతి చదువుతున్నాడు. గురువారం స్కూల్ కి వెళ్ళిన తన కొడుకు పాఠశాలలో ఆడుకుంటున్న సమయంలో కిందపడ్డాడు. దీంతో తలకు రక్త గాయం అవడంతో శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం కనీసం విద్యార్థిని హాస్పిటల్ తీసుకు వెళ్లకుండా పేరెంట్స్ కి సమాచారం అందించలేరని అన్నారు. విషయం తెలుసుకున్న తండ్రి పాఠశాలకు చేరుకొని పాఠశాల ప్రిన్సిపల్ ని ప్రశ్నించగా రెచ్చిపోయిన ప్రిన్సిపాల్ నువ్వేంటి మాకు చెప్పటం అని విద్యార్థి తండ్రి గల్ల పట్టి బయటకు తోసేసాడు. అనంతరం తన కొడుకుని తీసుకొని తండ్రి రవీంద్ర ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించాడు. స్కూల్ ప్రిన్సిపల్ పై ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు.

మల్దకల్‌లో 14 మంది బాల కార్మికులకు విముక్తి

- ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు
- బాలలను పనుల్లో పెట్టుకుంటే రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 వేల వరకు జరిమానా
- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి. వేణుగోపాల్

మల్దకల్ అక్టోబర్ 29 (జనంసాక్షి)మండల కేంద్రంలోని గురువారం నిర్వహించిన ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్‌లో 14 మంది బాల కార్మికులను గుర్తించి రక్షించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి. వేణుగోపాల్ తెలిపారు. వీరిలో నెతోనిపల్లికి చెందిన 8 మంది,ఆలూరుకు చెందిన ముగ్గురు,పెద్దొడ్డికి చెందిన ఇద్దరు,అరగిద్దకు చెందిన ఒకరు ఉన్నారు. పత్తి విత్తనాల పొలాల్లో పనుల కోసం మూడు వాహనాల్లో బాలలను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అరగిద్ద ఆంజనేయులు (రాయపురం)కురువ వీరేష్ (పెద్దొడ్డి)జమ్మన్నలపై విచారణ చేపట్టి, ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి,కౌన్సెలింగ్ అనంతరం చైల్డ్ హోమ్‌కు తరలించారు. బాలకార్మిక నిషేధం,నియంత్రణ చట్టం--1986 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.20,000 నుంచి రూ.50,000 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. విచారణ ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా విద్యను అభ్యసించేలా చూడాలని, బాలల హక్కులు, భవిష్యత్తును కాపాడాలని ఆయన కోరారు. ఎక్కడైనా బాలలను పనుల్లో పెట్టినట్లు లేదా పనుల కోసం తరలిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలనిసూచించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ కౌన్సిలర్ సురేష్,పోలీసు సిబ్బంది లక్ష్మణ్,ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మార్చిలోగా కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణం పూర్తిచేయాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్

కాళేశ్వరం, అక్టోబర్ 29 (జనం సాక్షి) : గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు అష్ట తీర్థాల ఘాట్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆమె జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో పర్యటించారు. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ప్రధాన ఆలయం, రామాలయం, జ్ఞాన వాపి బావి, శుభానంద అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. విజయ గణపతి ఆలయ నిర్మాణ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్‌ను సందర్శించి అష్టతీర్థాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, భూసేకరణ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోట్ జెట్టీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ పునర్నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ కాళేశ్వరం లో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, మండపాల నిర్మాణ పనులు కూడా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల పురోగతికి కృషి చేస్తున్న ధార్మిక సలహాదారు, దేవాదాయ శాఖ కమిషనర్, కాంట్రాక్టర్లు, స్థపతులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అయితే ప్రస్తుత పురోగతితో సంతృప్తి చెంది పనుల్లో వేగం తగ్గించరాదని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే ప్రధాన ఆలయ నిర్మాణ పనులను మార్చి నాటికి పూర్తి చేయడం అత్యంత కీలకమని అన్నారు. అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత గడువును తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అష్ట తీర్థాల ఘాట్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని శైలజా రామయ్యర్ సూచించారు.

ఆలయ నిర్మాణ పనులపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ స్థాయిలోనూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తాను ప్రతి నెలా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలిస్తానని వెల్లడించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. కాళేశ్వరాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులకు సంబంధించిన డిజైన్లు, ప్రణాళికలను త్వరగా ఖరారు చేయాలని సూచించారు. రహదారుల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను పుష్కరాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఆలయ తలుపులు, ధ్వజస్తంభాలు, కలశాలకు బంగారు లేదా వెండి తాపడం చేయించేందుకు దాతలను గుర్తించి విరాళాలు సమీకరించాలని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.195 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అష్టతీర్థాల ఘాట్లు, రహదారులు తదితర అభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించామని, వివిధ శాఖల సమన్వయంతో పనులను పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ధార్మిక సలహాదారు గోవింద హరి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కరువు నివారణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29(జనంసాక్షి): ఎన్నినో హెచ్చరికలు గత కొన్ని రోజులుగా జరుగుతున్నప్పటికీ వాటికి నివారణ చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ లో జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారి రవికుమార్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన కరువు ఛాయలు నెలకొన్నాయని, 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకుని రాష్ట్ర మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 25 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 6 లక్షల బోర్లు ఇప్పటికే నీరు లేక ఎండిపోయాయన్నారు. తాగునీరు, సాగునీరు కొరత ఏర్పడుతుందని, ధరల పెరుగుదల కొనసాగుతోందన్నారు. వాణిజ్య పంటకు ఎకరానికి 50 వేల రూపాయలు, ఇతర పంటలకు 30 వేల రూపాయలు చెల్లించాలని, రైతు భరోసా రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజుకు 800 రూపాయలు చెల్లించాలన్నారు. రేషన్ లబ్ధిదారులకు బియ్యంతో పాటు 14 రకాల వస్తువులు అందించాలని, అందులో 10 ఉచితంగా, 4 సబ్సిడీతో ఇవ్వాలని తెలిపారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇవ్వడం లేదని, మహారాష్ట్రకు 5 వేల కోట్లు కేటాయించి రాష్ట్రానికి కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రానికి 50 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు తీసుకురావాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల దాడులు పెరుగుతున్నాయని, టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు పేరుతో భూములను గిరిజనుల నుండి కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడుతూ సాగులో ఉన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పెంబి నుండి జన్నారం వరకు టైగర్ రిజర్వ్ పేరుతో గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు భూపాల్ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్ కార్మికులు గత 130 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్, ఆనంద్, కృష్ణమాచారి, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

సుద్ద ముక్కతో కంప్యూటర్ సీపీయూ, కీబోర్డు, మొబైల్

- చేర్యాల సూక్ష్మ కళాకారుడి అద్భుతాలు

చేర్యాల అక్టోబర్ 29 (జనంసాక్షి) : అంతర్జాతీయ ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన సూక్ష్మ కళాకారుడు జక్కనపల్లి రాము సుద్దముక్కలతో కంప్యూటర్, సీపీయూ, కీబోర్డ్, మౌస్, మొబైల్ ను అతి సూక్ష్మంగా చెక్కారు. ఇంటర్నెట్ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సందేశమిచ్చారు. సూక్ష్మ కళాకారున్ని చేర్యాల మండల ప్రజలు అభినందించారు.

దీపావళి గిఫ్ట్ పేరుతో వాట్సప్‌లో లింకులు

- క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ
- వాట్సాప్‌లో మోసగాళ్లతొ జాగ్రత్త

హైదరాబాద్ (జనంసాక్షి) : పండుగ పూట సామాన్యుల ఆశలను ఆసరాగా చేసుకుని వారి బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు సరికొత్త కుట్రకు తెరలేపారు. భారత ప్రభుత్వం దేశ పౌరులందరికీ దీపావళి కానుకగా రూ.8,000 నగదును ఉచితంగా అందిస్తోందంటూ వాట్సాప్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఓ నకిలీ సందేశంపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలను హెచ్చరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును దుర్వినియోగం చేస్తూ, అధికారిక ప్రభుత్వ పథకంలా భ్రమింపజేసేలా రూపొందించిన ఈ సందేశం పూర్తిగా మోసపూరితమైనదని బ్యూరో డైరెక్టర్, సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్ స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు పండుగ వాతావరణాన్ని క్యాష్ చేసుకునేందుకు వాట్సాప్‌లో ఒక ఆకర్షణీయమైన మెసేజ్ పంపుతున్నారు. అందులో కేంద్ర ప్రభుత్వం భారతీయులందరికీ దీపావళి ఆర్థిక సాయం కింద రూ.8,000 ఇస్తోందని, ఆ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి కింద ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేయాలని ఊరిస్తున్నారు.

రక్తపింజరి పాముకాటుతో యువరైతు మృతి!

బాలానగర్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన యువ రైతు రక్తపింజరి పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబానికి అండగా నిలవాల్సిన వయసులోనే మృత్యువు కబళించడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నెలకొంది. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి మృతిచెందడంతో గ్రామస్థులు సైతం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్ కుమారుడు వెంకటేష్ యాదవ్ (36) మంగళవారం తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రక్తపింజరి పాము కాటుకు గురయ్యాడు. పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. వెంకటేష్ యాదవ్‌కు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు నాలుగో తరగతి, చిన్న కుమారుడు రెండో తరగతి చదువుతున్నారు. చదువుకుంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ చిన్నారులకు తండ్రి దూరం కావడం గ్రామస్థులను కలచివేసింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వెంకటేష్ ఆకస్మిక మరణంతో భార్య, పిల్లల భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడికి చేరుకున్న వారిని కంటతడి పెట్టించాయి. వెంకటేష్ యాదవ్ మృతి విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్ కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేష్ మృతి పట్ల గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

గ్రామానికి సేవలందించిన మాజీ సర్పంచ్ కుటుంబంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోవడంతో ఉడిత్యాల గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. నిన్నటివరకు తమ మధ్య తిరిగిన వెంకటేష్ ఇక లేడనే వార్తను గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా ఇద్దరు చిన్నారులు తండ్రిని కోల్పోవడం అందరినీ కలచివేస్తోంది. కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరికీ సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులు సూచిస్తున్నారు. పొలాల్లో పనిచేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. పాము కాటు సంభవించినప్పుడు ఆలస్యం చేయకుండా బాధితుడిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించాలని సూచిస్తున్నారు. ఒక కుటుంబానికి పెద్దదిక్కును, ఇద్దరు చిన్నారులకు తండ్రిని దూరం చేసిన ఈ విషాద ఘటన ఉడిత్యాల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వెంకటేష్ యాదవ్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటుగా మిగిలిపోగా, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ప్రార్థిస్తున్నారు.

జహీరాబాద్‌లో ఆహార భద్రతాధికారుల తనిఖీలు

- హోటళ్లలో నాసిరకం సరుకులు.. వ్యాపారులకు నోటీసులు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనం సాక్షి): ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతాధికారులు హెచ్చరించారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, భోజనశాలలు, మిఠాయి దుకాణాల్లో జిల్లా ఆహార భద్రతాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రతాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు హోటళ్లలో పాడైపోయిన కూరగాయలు, నాసిరకం సరుకులను గుర్తించారు. అలాగే, కొన్ని దుకాణాల్లో విక్రయిస్తున్న నాసిరకం టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ప్రజలకు హానికరమైన ఆహార పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యాపారులు పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ, నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని సూచించారు.

జహీరాబాద్ లోని ఆయా దాబాల్లో, హోటలలో వంటగది నేల ఎగుడుదిగుడుగా, మురికిగా ఉండటం, గోడలకు రంధ్రాలు ఏర్పడటం, గోడలపై పెచ్చులు ఊడిపోవడం, కార్మికులు తల టోపీలు, చేతి తొడుగులు ధరించకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. తాగునీటి నిల్వ ట్యాంకు పగిలి ఉండటంతోపాటు, నీటిలో ధూళి కణాలు కనిపించినట్లు పేర్కొన్నారు. మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉండటం, నేల జారే విధంగా ఉండటం, ముగిపోయిన వంకాయలు, క్యాబేజీ, టమాటాలను వినియోగించడం, నిల్వ గదిలో కుళ్లిన టమాటాలు కనిపించడం, మూతలు లేని చెత్తబుట్టలు ఉండటం వంటి అంశాలను నోటీసులో ప్రస్తావించారు. ఈ లోపాలపై ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలని మెస్ యాజమాన్యాన్ని ఆదేశించారు. సంబంధిత ఆహార భద్రతా లైసెన్సును ఎందుకు నిలిపివేయకూడదో వివరించాలని, ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006లోని 54, 56 సెక్షన్ల కింద తదుపరి చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులే బాధ్యులు

సైబర్ నేరగాళ్ల వలలో పడి సామాన్యులు కష్టార్జితాన్ని కోల్పోతున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డిజిటల్ అరెస్టు' పేరుతో బెదిరించి లక్షల రూపాయలు కాజేస్తున్న ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట పడని ఈ తరుణంలో, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు బాధితులకు ఎంతో ఊరటనిచ్చేవి. ఇలాంటి మోసాల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించే బాధ్యత బ్యాంకులదేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ఖాతాల భద్రత ఆర్థిక సంస్థల బాధ్యతేనన్న ఈ అభిప్రాయం కేవలం న్యాయపరమైన వ్యాఖ్య కాదు, కోట్లాది ఖాతాదారుల విశ్వాసానికి భరోసా.

ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని నమ్మకంతో బ్యాంకుల్లో దాచుకుంటారు. ఆ సొమ్ముకు రక్షణ కల్పించడం బ్యాంకుల ప్రాథమిక కర్తవ్యం. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించే వ్యవస్థలు, హెచ్చరిక యంత్రాంగాలు ఉన్నప్పటికీ, అవి సమర్థంగా పనిచేయకపోవడం వల్లే మోసగాళ్లు సులభంగా డబ్బును ఇతర ఖాతాల్లోకి మళ్లించగలుగుతున్నారు. ఖాతాదారుడు తెలియక చేసిన పొరపాటును సాకుగా చూపి చేతులు దులుపుకునే ధోరణి ఇకపై చెల్లదని సుప్రీం ధర్మాసనం సంకేతమిచ్చింది. బ్యాంకుల నిర్లక్ష్యం ఉన్నట్లు రుజువైతే, బాధితులు కోల్పోయిన మొత్తాన్ని కనీసం పరిహారంగా అందించాల్సిందేనని పేర్కొనడం ఈ విషయంలో కీలక మలుపు.

విద్యావంతులు సైతం ఈ మోసాల్లో చిక్కుకోవడం పట్ల న్యాయస్థానం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఇది వ్యక్తుల అమాయకత్వానికి సంబంధించిన సమస్య కాదు; నేరగాళ్లు అత్యాధునిక సాంకేతికతను, మానసిక ఒత్తిడిని ఆయుధాలుగా మలచుకుంటున్నారన్న వాస్తవాన్ని ఇది చాటుతోంది. కాబట్టి బాధితులను నిందించడం కాకుండా, వారికి అండగా నిలవడం వ్యవస్థల విధి. బాధితులకు పరిహారం అందేలా స్పష్టమైన నియంత్రణ చట్రాన్ని రూపొందించాలని ధర్మాసనం సూచించింది. రిజర్వ్ బ్యాంక్ సహా సంబంధిత సంస్థలు ఈ దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

బాధ్యత బ్యాంకులపై పడినప్పుడే అవి భద్రతా ప్రమాణాలను కఠినతరం చేస్తాయి. అనుమానిత లావాదేవీలపై తక్షణ నిఘా, పెద్ద మొత్తాల బదిలీలకు అదనపు ధ్రువీకరణ, ఖాతాదారులకు నిరంతర అవగాహన వంటి చర్యలు తప్పనిసరి కావాలి. అదే సమయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఏ దర్యాప్తు సంస్థా ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా అరెస్టు చేయదన్న సంగతి గుర్తుంచుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని బ్యాంకులు, ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు సమష్టిగా అమలు చేసినప్పుడే డిజిటల్ లావాదేవీల పట్ల ప్రజల్లో నమ్మకం నిలుస్తుంది.

విషవాయువుల నుండి విముక్తికై..

రనభేరై రణములోన వస్తూ..
పాదయాత్రై ప్రజల తరపున
నేనున్నానని ..
ప్రజాసైనికుడై
ప్రజలచేంతకు వస్తూ..
డంపింగు నిర్వాసిత
ప్రాంతమంత పాదయాత్రై..
ప్రశ్నించే గొంతుకై ప్రశ్నిస్తూ..
నల్లగొండను మించిపాయే
ఫ్లోరైడ్ భూతం..
మీథేన్ విషవాయువుల వలలో
చిక్కిన అక్షరాల
24 లక్షల మంది విల విల..
గోల్కొండను చూస్తే అందం..
జవహర్ నగర్‌ను చూస్తే వికారం..
పంట భూములు
విషపు భూములై తరిమేసేను..
పశుసంపద కరిగిపోయి
జీవములో జీవించే కోటి జీవరాశులు..
ఎక్కడ పోయేను
ఎవరు మాయం చేశెరో..
భాగ్యనగరం చెత్తంతా
ప్రతిదినము పదివేల టన్నుల వ్యర్థాలు జల
కాలుష్యం వాయు కాలు ష్యం శబ్ద కాలుష్యం
ప్రజలకు నిర్వాసితులకు అంతుచిక్కని
వ్యాధులతో అయోమయం..
ప్రాణాంతకమైన వ్యాధులతో
ప్రాణాలే గాలిలో కాలువంగా
అందమైన భాగ్యనగరంలో
మురికి కూపం ఎవరి పాపం..
మీథేన్ భూతాపంతో
బగ బగ మండెను..
డంపింగు యార్డును
కదలించ ప్రజా నాయకుడు..
పాదయాత్రై ఈటల రాజేందర్
కదిలిండు చూడు..
ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారి
గొంతు లేని గొంతుకు గొంతై..
నినాదం దావాల విశ్వవ్యాప్తినేను..
ప్రజల కన్నీటి వ్యధలను తిరుస్తుందని..
ప్రజల నమ్మకం..

దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాద యాత్రకు మద్దతుగా..

వైద్యం.. వ్యాపారమా, ప్రజల హక్కా?

ఒకప్పుడు కుటుంబ వైద్యుడు చెప్పిన మాట రోగికి ధైర్యాన్నిచ్చేది. ఆయన సూచించిన మందుపై, చేసిన పరీక్షపై, ఇచ్చిన భరోసాపై కుటుంబానికి నమ్మకం ఉండేది. ఇప్పుడు చిన్న అనారోగ్యానికి ఆసుపత్రికి వెళితే వరుస పరీక్షలు, ఖరీదైన మందులు, అనేక మంది నిపుణుల సంప్రదింపులు, చివరకు భారీ బిల్లు. ఒక వైద్యుడి నిర్ధారణ సరిపోతుందా, మరో అభిప్రాయం తీసుకోవాలా, ఆపరేషన్ తప్పనిసరేనా అనే సందేహాలు రోగిని వెంటాడుతున్నాయి. ఆధునిక వైద్య పరిజ్ఞానం అద్భుతమైన ప్రాణరక్షక ఫలితాలను అందిస్తున్నప్పటికీ, అదే రంగంలో పెరుగుతున్న వాణిజ్య ధోరణులు వైద్యుడు–రోగి సంబంధాన్ని అనుమానాల బంధంగా మారుస్తున్నాయి. దీనికి బాధ్యత కొందరు వైద్యులదే కాదు; ప్రజారోగ్యాన్ని తగినంతగా బలోపేతం చేయని ప్రభుత్వాలది, పారదర్శకత లోపించిన ఆసుపత్రులది, రోగుల బలహీనతను లాభాల అవకాశంగా చూసే వ్యాపార వ్యవస్థలది కూడా.

రూ.11,000కు లభించే క్యాన్సర్ ఇంజెక్షన్‌ను ఒక కార్పొరేట్ ఆసుపత్రి రూ.1.30 లక్షలకు విక్రయించిందన్న ఉదంతాన్ని 2026 అక్టోబరు 27న సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ప్రస్తావించింది. రూ.15కు లభించే డ్రిప్ లైన్‌కు రూ.250 వసూలు చేస్తున్నారన్న అంశాన్నీ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ధరల వ్యత్యాసాలను సమర్థించడానికి ఆసుపత్రుల నిర్వహణ ఖర్చులను చూపడం ఎంతవరకు సమంజసమని న్యాయమూర్తులు నిలదీశారు. అయితే ఇవి విచారణలో ప్రస్తావించిన ఉదంతాలు, ఆరోపణలు మాత్రమే; వీటిపై తుది న్యాయనిర్ణయం వెలువడిందని భావించకూడదు. అయినప్పటికీ, ప్రాణరక్షక మందుల ధరలపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇంత తీవ్రంగా ప్రశ్నించాల్సి రావడం వైద్యరంగ నియంత్రణలోని లోపాలను స్పష్టం చేస్తోంది.

భారతదేశంలో ఆరోగ్య సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవాలంటే వ్యాధుల స్వభావాన్ని పరిశీలించాలి. గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు దేశ ప్రజారోగ్యానికి ప్రధాన సవాళ్లు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, 2023లో భారతదేశ మరణాల్లో 71.1 శాతం అసంక్రమిత వ్యాధులకు సంబంధించినవే. గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, శ్వాసకోశ సమస్యలు, మధుమేహం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. క్షయ, ఇతర అంటువ్యాధులు, తల్లి–శిశు ఆరోగ్య సమస్యలు కూడా ప్రజారోగ్య వ్యవస్థపై భారాన్ని మోపుతున్నాయి. ఈ వ్యాధులకు దీర్ఘకాలిక చికిత్స అవసరమవు తుంది. అందువల్ల మందుల ధరలు, పరీక్షల ఖర్చులు, వైద్య సదుపాయాల లభ్యత కోట్లాది కుటుంబాల ఆర్థిక భద్రతను నిర్ణయిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యవ్యవస్థ బలంగా ఉండాలి. కానీ అనేక ప్రాంతాల్లో నిపుణుల కొరత, పరీక్షా పరికరాల లేమి, మందుల కొరత, పడకల కొరత, వైద్యులపై అధిక పనిభారం వంటి సమస్యలు రోగులను ప్రైవేట్ ఆసుపత్రులవైపు నెడుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన సదుపాయాలు అందుబాటులో ఉంటే ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతుంది.

జాతీయ ఆరోగ్య ఖాతాల అంచనాల ప్రకారం, 2021–22లో భారతదేశ మొత్తం ఆరోగ్య వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 3.83 శాతం కాగా, ప్రభుత్వ ఆరోగ్య వ్యయం 1.84 శాతంగా ఉంది. కుటుంబాలు నేరుగా భరించిన ఆరోగ్య ఖర్చు మొత్తం ఆరోగ్య వ్యయంలో 39.4 శాతానికి చేరింది. జాతీయ ఆరోగ్య విధానం–2017 ప్రభుత్వ ఆరోగ్య వ్యయాన్ని స్థూల దేశీయోత్పత్తిలో 2.5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం కేవలం సంక్షేమ చర్య కాదు; ప్రజలు ప్రైవేట్ వైద్యంపై పూర్తిగా ఆధారపడకుండా చేసే ఆర్థిక రక్షణ కవచం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు సరిపోకపోవడాన్ని ప్రైవేట్ రంగం తన సేవల అవసరాన్ని సమర్థించడానికి ఉపయోగిస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు భవనాలు, పరికరాలు, నిపుణుల వేతనాలు, అత్యవసర సేవలు నిర్వహించడానికి భారీ ఖర్చులు ఉంటాయన్నది నిజం. కానీ ఆ ఖర్చుల పేరుతో ప్రతి మందుపై, ప్రతి వైద్య పరికరంపై అపరిమిత మార్జిన్లు విధించే హక్కు లేదు. మందుల కొనుగోలు ధర, రోగికి విధించే ధర, వైద్యుల ఫీజు, పరీక్షల ఖర్చు, ఆసుపత్రి సేవల ఛార్జీలను స్పష్టంగా ప్రతి ఆసుపత్రిలో విధిగా, పారదర్శకంగా పెద్ద బోర్డు పై మాతృ భాషలో సైతం ప్రదర్శించి చూపించాలి. లాభం పొందడం వ్యాపార స్వభావం కావచ్చు; రోగి ప్రాణాపాయాన్ని ఆసరాగా చేసుకుని అతని ఆర్థిక బలహీనతను దోపిడీ చేయడం మాత్రం సమర్థనీయం కాదు.

అనవసర పరీక్షలు ఈ వాణిజ్య ధోరణిలో మరో ఆందోళనకర అంశం. రక్తపరీక్షలు, స్కానింగ్, కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ), మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ), ట్యూమర్ మార్కర్ పరీక్షలు వంటి నిర్ధారణ పద్ధతులు అవసరమైనప్పుడు ప్రాణాలను కాపాడగలవు. కానీ ప్రతి పరీక్ష ప్రతి రోగికి అవసరం కాదు. అంతర్జాతీయ వైద్య పరిశోధనల సమీక్షలో 55 దేశాలకు సంబంధించిన 154 అధ్యయనాలను పరిశీలించగా, అనవసర నిర్ధారణలు, అధిక పరీక్షల వినియోగం విస్తృతంగా ఉన్నట్లు వెల్లడైంది. కొన్ని సందర్భాల్లో తక్కువ ప్రయోజనం కలిగిన పరీక్షలు అదనపు ఖర్చుతోపాటు తప్పుడు అనుమానాలు, మరిన్ని పరీక్షలు, అనవసర చికిత్సలకు దారితీస్తాయి.

ఒక ఉదాహరణ తీసుకుందాం. సాధారణ వెన్నునొప్పి ఉన్న ప్రతి వ్యక్తికీ వెంటనే ఎంఆర్ఐ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు. వైద్య చరిత్ర, శారీరక పరీక్షల ఆధారంగా మొదట చికిత్స అందించవచ్చు; ప్రమాద సూచనలు ఉన్నప్పుడు మాత్రం ఆలస్యం చేయకుండా తగిన పరీక్షలు అవసరం. అలాగే ప్రతి జ్వరానికీ విస్తృత పరీక్షల ప్యాకేజీ, ప్రతి అలసటకూ అనేక రక్తపరీక్షలు, ప్రతి చిన్న లక్షణానికీ ఖరీదైన స్కానింగ్ చేయడం శాస్త్రీయ వైద్యానికి నిదర్శనం కాదు. అయితే ఏ పరీక్ష అవసరమో రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలను బట్టి వైద్యుడే నిర్ణయించాలి. పరీక్షలను తగ్గించాలనే పేరుతో అవసరమైన నిర్ధారణను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరమే.

అయితే ఒక పరీక్ష ఫలితం కొద్దిగా మారిందని వెంటనే ప్రాణాపాయం ఉందని చెప్పడం, ఖరీదైన చికిత్స లేదా మందులను తక్షణమే కొనాలని ఒత్తిడి చేయడం, జీవనశైలి మార్పులతో నియంత్రించగల పరిస్థితులకు కూడా అతిగా మందులు సూచించ డం వంటి చర్యలు జరిగితే వాటిని ప్రశ్నించాలి. కొలెస్ట్రాల్‌కు మందు అవసరమా అనేది కేవలం ఒక సంఖ్య ఆధారంగా నిర్ణయించరు; గుండె జబ్బుల చరిత్ర, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల పనితీరు, మొత్తం హృదయ సంబంధ ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అధిక బరువున్న ప్రతి వ్యక్తికి ఒకే విధమైన చికిత్స సరిపోదు. కొందరికి ఆహార నియంత్రణ, వ్యాయామం, నిద్రలో మార్పులు సరిపోవచ్చు; మరికొందరికి వైద్య చికిత్స అవసరమవుతుంది. నిజమైన ప్రమాదాన్ని వివరించడం వైద్యుడి బాధ్యత; భయాన్ని సృష్టించి చికిత్సను విక్రయించడం మాత్రం వైద్య నైతికతకు విరుద్ధం.

ఒక ఆపరేషన్ సూచించినప్పుడు, ముఖ్యంగా అత్యవసర పరిస్థితి కానప్పుడు, మరో నిపుణుడి అభిప్రాయం తీసుకోవడం ఉపయోగకరమే. మొదటి వైద్యుడిని అవమానించడం కాదు ఇది; రోగి సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకునే హక్కును వినియోగించుకోవడమే. కానీ ప్రతి రిపోర్టుపై అనుమానం, ప్రతి ఆపరేషన్‌పై సందేహం, ప్రతి వైద్యుడిపై అపనమ్మకం పెరిగే పరిస్థితి కూడా ఆరోగ్య వ్యవస్థ వైఫల్యమే. వైద్యులు చికిత్సకు కారణం, ప్రత్యామ్నాయాలు, ప్రమాదాలు, ఖర్చులను వివరించాలి. రోగులు ప్రశ్నలు అడగడానికి భయపడకూడదు. వైద్యుడు–రోగి సంబంధం పరస్పర విశ్వాసం, గౌరవం, స్పష్టమైన సమాచారంపై నిలవాలి.

ఔషధ కంపెనీలు వైద్యులను ప్రభావితం చేయడానికి బహుమతులు, పర్యటనలు లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నాయన్న ఆరోపణలు కూడా తీవ్రంగా పరిశీలించాల్సినవే. ఔషధ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యూనిఫాం కోడ్ ఫర్ ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్--2024 అనుచిత ప్రయోజనాలను నియంత్రించడానికి ఉద్దేశించింది. కానీ నియమావళి ఉండటం మాత్రమే సరిపోదు; ఉల్లంఘనలపై స్వతంత్ర విచారణ, పారదర్శక ప్రకటనలు, తగిన శిక్షలు అవసరం. అన్ని వైద్యులనూ లేదా అన్ని కంపెనీలనూ ఒకే విధంగా నిందించకుండా, నిర్దిష్ట ఆధారాలతో అక్రమ సంబంధాలను బయటపెట్టాలి.

విదేశాల్లో నిషేధించిన మందులు భారత్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలపైనా అప్రమత్తత అవసరం. ఒక దేశంలో నిషేధం విధించారనే కారణంతో ఆ మందు ప్రపంచవ్యాప్తంగా నిషేధితమని చెప్పలేం. అయినప్పటికీ, భద్రతా లోపాలు లేదా తీవ్రమైన దుష్ప్రభావాల కారణంగా ఇతర దేశాల నియంత్రణ సంస్థలు ఉపసంహరించిన మందులను భారత ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) తక్షణమే సమీక్షించాలి. 2026 జూన్‌లో శాస్త్రీయంగా సమర్థించలేని లేదా ఆరోగ్యానికి ప్రమాదకరమయ్యే 16 స్థిర మోతాదు ఔషధ కలయికలను నిషేధిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చర్య తీసుకుంది. ఇది సరైన దిశలో అడుగు. అయితే ఇప్పటికే మార్కెట్లో ఉన్న మందుల భద్రతను నిరంతరం పరిశీలించడం, దుష్ప్రభావాల సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే హెచ్చరికలు ఇవ్వడం కూడా అంతే ముఖ్యం. కేంద్ర ప్రభుత్వం ఔషధ ధరల జాతీయ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) అధికారాలను బలోపేతం చేయాలి. అవసరమైన మందుల ధరల నియంత్రణను విస్తరించడంతోపాటు ఆసుపత్రుల్లో విక్రయించే మందులు, వైద్య పరికరాలు, వినియోగ వస్తువులపై న్యాయమైన మార్జిన్ పరిమితులు విధించాలి. ఆసుపత్రుల ధరల పట్టికలు, పరీక్షల ఛార్జీలు, చికిత్స ప్యాకేజీలు బహిరంగంగా అందుబాటులో ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనవసర పరీక్షలు, తప్పుడు బిల్లులు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అనుచిత వైద్య ప్రవర్తనపై ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. వైద్య నిర్లక్ష్యం, ధరల దోపిడీ, నాణ్యత లోపాలపై స్వతంత్ర ఫిర్యాదు వ్యవస్థలు ఉండాలి. ప్రభుత్వ వైద్యవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగితేనే ప్రైవేట్ రంగంలో అన్యాయమైన ధరలపై ఒత్తిడి పెరుగుతుంది.

ప్రజలు కూడా వైద్యుల సూచనలను అర్థం చేసుకోవాలి, అవసరమైనప్పుడు రెండో అభిప్రాయం తీసుకోవాలి, మందుల బిల్లులు భద్రపరచాలి, చికిత్సకు ప్రత్యామ్నాయాలు అడగాలి. అయితే వైద్యుడి సలహా లేకుండా మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్ మందులను నిలిపివేయకూడదు; అవసరమైన పరీక్షలను భయంతో వాయిదా వేయకూడదు. ఔషధ ధరలను అధికారిక వేదికల్లో పోల్చుకోవాలి, అనుమానాస్పద మందులు లేదా తీవ్రమైన దుష్ప్రభావాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

వైద్య రంగం ప్రజల విశ్వాసంతోనే నిలబడుతుంది. వైద్యుడిని దేవుడిగా చూడాల్సిన అవసరం లేదు; అదే సమయంలో ప్రతి వైద్యుడినీ వ్యాపారిగా అనుమానించాల్సిన పరిస్థితి కూడా ఉండకూడదు. వైద్యులు నైతికతను, ఆసుపత్రులు పారదర్శకతను, ఔషధ కంపెనీలు బాధ్యతను, ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని తమ ప్రాధాన్యాలుగా స్వీకరించాలి. రోగి ప్రాణం ఒక వ్యాపార వస్తువు కాదు. ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి; ఆరోగ్యం సంపన్నుల ప్రత్యేక హక్కుగా, పేదలకు అప్పుల భారంగా మారకూడదు. ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థపై ప్రజలకే నమ్మకం లేకపోతే, అది కేవలం వైద్యరంగ సంక్షోభం కాదు–సామాజిక న్యాయానికి ఎదురైన తీవ్రమైన సవాలు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

అభివృద్ధి ముసుగులో ప్రకృతి విధ్వంసం

నిన్నటి సంచిక తరువాయి



ఆసుపత్రుల సంఖ్య పెంచడం, వైద్య పరికరాలను సమకూర్చడం, వైద్యుల సేవలను విస్తరించడం అవసరమే. అదే సమయంలో ప్రజలు పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, నివసించే పరిసరాలు ఆరోగ్యానికి అనుకూలంగా ఉండేలా చూడాలి. ప్రజారోగ్య విధానాలు చికిత్సతో పాటు నివారణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వాల బాధ్యత అత్యంత కీలకం. పరిశ్రమల ఉద్గారాలపై కఠినమైన పర్యవేక్షణ, కాలుష్య నియంత్రణ నిబంధనల అమలు, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, ప్రజా రవాణా విస్తరణ, స్వచ్ఛమైన ఇంధన వినియోగం, అడవుల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు సమర్థంగా అమలు కావాలి. పర్యావరణానికి హాని కలిగించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. పర్యావరణ ప్రభావ అంచనాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి, స్థానిక పర్యావరణంపై కలిగే ప్రభావాలను నిజాయితీగా పరిశీలించాలి.

పట్టణాల్లో గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి. ప్రజలకు అర్థమయ్యే విధంగా కాలుష్య స్థాయిల సమాచారాన్ని అందించాలి. కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలి. పరిశ్రమలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల మధ్య తగిన ప్రణాళికా దూరాలు పాటించాలి. నీటి వనరుల నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి, కలుషితం గుర్తించినప్పుడు ప్రజలకు ప్రత్యామ్నాయ తాగునీరు అందించాలి.

ప్రజల బాధ్యత కూడా తక్కువేమీ కాదు. అవసరమైనప్పుడు ప్రజా రవాణాను వినియోగించడం, సాధ్యమైనంతవరకు నడక లేదా సైకిల్‌ను ప్రోత్సహించడం, విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించడం, చెత్తను బహిరంగంగా కాల్చకపోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం వంటి చర్యలు పర్యావరణానికి మేలు చేస్తాయి. అయితే వ్యక్తిగత బాధ్యత పేరుతో ప్రభుత్వాలు, పరిశ్రమల బాధ్యతను విస్మరించకూడదు. కాలుష్యాన్ని తగ్గించడానికి వ్యక్తుల ప్రయత్నాలతో పాటు వ్యవస్థాగత మార్పులు కూడా తప్పనిసరి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పర్యావరణ విద్యను పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆచరణలోకి తీసుకురావాలి. విద్యార్థులు తమ పరిసరాల్లోని నీటి వనరులు, చెత్త నిర్వహణ, గాలి నాణ్యత, చెట్ల సంరక్షణపై అధ్యయనాలు చేయాలి. స్థానిక సంస్థలు, వైద్యులు, పర్యావరణ నిపుణులు, ప్రజా సంఘాలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పర్యావరణ పరిరక్షణను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర సామాజిక ఉద్యమంగా మార్చాలి.

ప్రకృతి మనిషికి వ్యతిరేకి కాదు. ప్రకృతి వ్యవస్థలను అర్థం చేసుకోకుండా, వాటి పరిమితులను గుర్తించకుండా వ్యవహరించినప్పుడే మనిషి తనకు తానే ప్రమాదాన్ని సృష్టించుకుంటాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రకృతిని నాశనం చేయడానికి కాకుండా దాన్ని సంరక్షించడానికి వినియోగించాలి. సౌర, పవన విద్యుత్, తక్కువ ఉద్గారాల రవాణా, వ్యర్థాల పునర్వినియోగం, నీటి శుద్ధి, కాలుష్యాన్ని గుర్తించే సాంకేతిక పరికరాలు, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు అభివృద్ధికి, ప్రకృతి పరిరక్షణకు మధ్య సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయి.

సంపన్న దేశాలు, పెద్ద పారిశ్రామిక సంస్థలు, అధిక వనరులను వినియోగించే వర్గాలు తమ పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడంలో ముందుండాలి. చారిత్రకంగా ఎక్కువ కాలుష్య ఉద్గారాలకు బాధ్యత వహించిన దేశాలు స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుబాటులోకి తీసుకురావాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా పర్యావరణ ప్రమాణాలను బలహీనపరచకుండా ఉపాధి, పారిశ్రామిక ప్రగతి, ప్రజారోగ్యాన్ని సమన్వయం చేయాలి. సంపద సృష్టి అవసరమే కానీ ఆ సంపదను సంపాదించే క్రమంలో ప్రజల ఆరోగ్యాన్ని, భవిష్యత్తు తరాల జీవనాధారాలను నాశనం చేయడం సమర్థనీయం కాదు.

ప్రకృతి ప్రభావంతో అమాయక ప్రజలు రోగాల బారిన పడుతున్నారనే వాస్తవాన్ని సమాజం తీవ్రంగా పరిగణించాలి. కాలుష్యాన్ని సృష్టించేవారు లాభాలు పొందుతూ, దాని వల్ల అనారోగ్యానికి గురైన పేదలు తమ చికిత్స ఖర్చులను తామే భరించాల్సిన పరిస్థితి మారాలి. కాలుష్య బాధిత ప్రాంతాల్లో ఆరోగ్య సర్వేలు, ఉచిత వైద్య పరీక్షలు, క్యాన్సర్ ముందస్తు గుర్తింపు కార్యక్రమాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, పర్యావరణ న్యాయం అందించాలి. వ్యాధి నిర్ధారణలో ఆలస్యం తగ్గించాలి. క్యాన్సర్ వంటి వ్యాధులపై భయాందోళనలు పెంచడం కాకుండా, శాస్త్రీయ అవగాహన కల్పించి, అవసరమైన పరీక్షలు చేయించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలి.

ముగింపుగా చెప్పాలంటే, మానవ నాగరికత సాధించిన విజయాలు ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని మరచిపోయేలా చేయకూడదు. అభివృద్ధి పేరుతో అడవులను నాశనం చేస్తూ, నదులను కలుషితం చేస్తూ, గాలిని విషపూరితం చేస్తూ, భూమి సహజ వనరులను విచక్షణారహితంగా వినియోగిస్తే దాని మూల్యం చివరకు సమాజమే చెల్లించాల్సి వస్తుంది. ఆ మూల్యం రూపాయల్లో మాత్రమే ఉండదు; అనారోగ్యంతో బాధపడే కుటుంబాల్లో, వైద్య ఖర్చులతో అప్పుల పాలయ్యే పేదల్లో, కోల్పోయిన ప్రాణాల్లో, దెబ్బతిన్న జీవనోపాధుల్లో కనిపిస్తుంది. మనిషి సంపద పెరగడం కంటే ఆరోగ్యంగా జీవించడం ముఖ్యం. సాంకేతిక ప్రగతి అవసరమే, పారిశ్రామిక అభివృద్ధి అవసరమే, విలాసవంతమైన జీవితం కోరుకోవడంలోనూ తప్పు లేదు. కానీ వాటి కోసం ప్రకృతిని బలి చేయకూడదు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన ఆరోగ్యాన్ని, మన ఆర్థిక భద్రతను, మన పిల్లల భవిష్యత్తును కాపాడుకోవడమే. ప్రకృతి పరిరక్షణను నిర్లక్ష్యం చేసే సమాజం చివరకు తన ఆరోగ్యాన్నే ప్రమాదంలోకి నెట్టుకుంటుంది. అందువల్ల అభివృద్ధికి పర్యావరణ బాధ్యతను జోడించి, ప్రకృతితో సహజీవనం చేసే జీవన విధానాన్ని స్వీకరించడమే నేటి మానవాళి ముందున్న అత్యవసర కర్తవ్యం.

ప్రకృతిని కాపాడుకోవడమే మానవాళి మనుగడకు మార్గం!

ప్రకృతిని పరిరక్షించుకోవడం అనేది కేవలం పర్యావరణ ప్రేమికుల బాధ్యత మాత్రమే కాదు; ఈ భూమిపై జీవించే ప్రతి మనిషి ప్రాథమిక కర్తవ్యం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక ప్రగతి మానవ జీవితాన్ని సుఖవంతం చేయడానికి ఉపయోగపడాలి తప్ప, మనిషి మనుగడకే ముప్పుగా మారకూడదు. అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం, చెరువులను ఆక్రమించడం, నదులను కలుషితం చేయడం, భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించడం, గాలిలోకి విషపూరిత వాయువులను విడుదల చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయడం వంటి చర్యలు చివరకు సమాజానికే ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. ప్రకృతి వనరులను మనిషి తన ఇష్టానుసారం దోచుకోవడానికి ఉన్న సంపదగా కాకుండా, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ఉమ్మడి వారసత్వంగా భావించాలి. ప్రపంచంలోని సంపన్న దేశాలు, బహుళజాతి సంస్థలు, భారీ పారిశ్రామిక వర్గాలు, అధికంగా వనరులను వినియోగించే ప్రజలు పర్యావరణ పరిరక్షణలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. విలాసవంతమైన జీవితం కోసం ప్రకృతిపై మోపుతున్న భారాన్ని తగ్గించాలి. పర్యావరణానికి హాని కలిగించే ఉత్పత్తుల తయారీ, వినియోగం, వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ ప్రమాణాలను పాటించాలి. పర్యావరణానికి కలిగే నష్టాన్ని లెక్కచేయకుండా లాభాలే పరమావధిగా వ్యవహరించే సంస్థలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలకు అందుబాటులోకి తీసుకురావాలి. కాలుష్యాన్ని తగ్గించే బాధ్యతను పేద దేశాలపై, సామాన్య ప్రజలపై మాత్రమే మోపడం అన్యాయం. పర్యావరణ నష్టానికి ఎంతవరకు ఎవరు బాధ్యత వహిస్తున్నారో గుర్తించి, అందుకు అనుగుణంగా బాధ్యతలను నిర్ణయించాలి.

భారతదేశంలో క్యాన్సర్, గుండెజబ్బులు, శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం వంటి అనారోగ్య సమస్యల నియంత్రణకు వైద్య సేవలను విస్తరించడంతో పాటు వ్యాధులకు దారితీసే ప్రమాద కారకాలను తగ్గించాలి. వాయు కాలుష్యాన్ని నియంత్రించడం, స్వచ్ఛమైన తాగునీటిని అందించడం, ఆహార భద్రతను బలోపేతం చేయడం, రసాయనాల సురక్షిత వినియోగాన్ని నిర్ధారించడం, పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేయడం ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యాలుగా ఉండాలి. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై నిరంతర అధ్యయనాలు నిర్వహించాలి. క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలి. పేదలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలి. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం కంటే, వ్యాధుల ప్రమాదాన్ని ముందుగానే తగ్గించేందుకు పర్యావరణ పరిరక్షణపై పెట్టుబడి పెట్టడం సమాజానికి ఎంతో ప్రయోజనకరం.

ప్రజలు కూడా తమ దైనందిన జీవితంలో పర్యావరణ హితమైన అలవాట్లను పెంపొందించుకోవాలి. అవసరం లేనప్పుడు విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని పరిమితం చేయడం, చెత్తను వేరు చేసి పారవేయడం, నీటిని పొదుపుగా ఉపయోగించడం, చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్నచిన్న చర్యలు సమష్టిగా పెద్ద మార్పుకు దోహదపడతాయి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించాలి. మీడియా ప్రజలకు శాస్త్రీయ సమాచారాన్ని అందించి, కాలుష్య సమస్యలపై అవగాహన కల్పించాలి. పర్యావరణానికి హాని కలిగించే చర్యలు ఎక్కడ కనిపించినా ప్రజలు చట్టబద్ధమైన మార్గాల్లో ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలి.

ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ప్రకృతి విధ్వంసం వల్ల కలిగే అనారోగ్యానికి ఆర్థికంగా బలహీనమైన ప్రజలు ఎక్కువ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి మారాలి. కాలుష్యాన్ని సృష్టించే వారు లాభాలను పొందుతూ, దాని ప్రభావంతో అనారోగ్యానికి గురయ్యే సామాన్యులు తమ ప్రాణాలను, సంపాదనను, కుటుంబ భవిష్యత్తును కోల్పోవడం సామాజిక న్యాయానికి విరుద్ధం. స్వచ్ఛమైన గాలి పీల్చడం, సురక్షితమైన నీటిని తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం ప్రతి పౌరుడి హక్కు. ఈ హక్కును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; పరిశ్రమలు, సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి సమష్టి బాధ్యత కూడా.

అంతిమంగా, ప్రకృతిని జయించాలనే ఆలోచనకు బదులుగా ప్రకృతితో కలిసి జీవించాలనే దృక్పథాన్ని మానవ సమాజం అలవరచుకోవాలి. మనిషి ఎంతటి సాంకేతిక ప్రగతిని సాధించినా స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం లేకుండా ఆరోగ్యంగా జీవించలేడు. ప్రకృతిని నాశనం చేసి సంపదను కూడబెట్టడం నిజమైన అభివృద్ధి కాదు. ప్రకృతిని కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పేదరికాన్ని తగ్గించడం, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడం మాత్రమే సమగ్ర అభివృద్ధి. ఈ భూమి మన పూర్వీకుల నుంచి మనకు అందిన వారసత్వం మాత్రమే కాదు; మన తరువాతి తరాల నుంచి మనం తీసుకున్న బాధ్యత కూడా. అందువల్ల నేటి తరం స్వార్థపూరిత వినియోగ సంస్కృతిని విడిచిపెట్టి, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని స్వీకరించాలి. ప్రకృతిని కాపాడితేనే మనిషి మనుగడ సురక్షితంగా ఉంటుంది. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే ప్రజారోగ్యం బలోపేతమవుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడితేనే దేశాభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుంది. ప్రకృతిని నిర్లక్ష్యం చేసే సమాజం చివరకు తన భవిష్యత్తునే ప్రమాదంలోకి నెట్టుకుంటుంది. కాబట్టి ప్రకృతి పరిరక్షణను నేటి తరం అత్యున్నత సామాజిక బాధ్యతగా స్వీకరించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ఇప్పుడే కార్యాచరణ ప్రారంభించాలి.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి తావులేకుండా నిబంధనలు అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, అక్టోబర్ 29 (జనం సాక్షి) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఆసుపత్రుల్లో వివిధ వైద్య సేవలకు సంబంధించిన ధరల పట్టికలను రోగులకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో కొత్త ప్రైవేట్ ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతులు, ఇప్పటికే ఉన్న ఆసుపత్రుల లైసెన్సుల పునరుద్ధరణ, డయాగ్నస్టిక్ సెంటర్ల రెన్యూవల్‌కు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమర్పించిన మొత్తం 10 ప్రతిపాదనలను కమిటీ పరిశీలించింది. సంబంధిత నిబంధనలు, ప్రమాణాలను పాటించిన దరఖాస్తుదారులకు కమిటీ అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో పారదర్శకత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రోగులకు అందించే వైద్య సేవలు, వాటికి సంబంధించిన ధరల వివరాలను ముందుగానే తెలుసుకునేలా ధరల పట్టికలను ప్రదర్శించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఆసుపత్రుల బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు నిర్వహించినా, నిర్దేశిత ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య హాస్టల్‌లో విద్యార్థిపై దాడికి బాధ్యులెవరూ..?

- యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి..
- బాధితుడికి న్యాయం చేయాలి
- ఎస్ఎఫ్ఐ

బోడుప్పల్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : విద్యార్థుల భద్రతకు భరోసా ఇవ్వాల్సిన విద్యాసంస్థల హాస్టళ్లలోనే దాడులు జరిగితే బాధ్యత ఎవరిది? బోడుప్పల్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి కందుల అనుదీప్ (17) తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. విద్యార్థుల భద్రతను గాలికొదిలేశారా? హాస్టల్‌లో పర్యవేక్షణ ఏమైనట్లు? అంటూ ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనకు బాధ్యులైన వారితో పాటు నిర్లక్ష్యం వహించిన కళాశాల యాజమాన్యంపై కూడా కేసులు నమోదు చేసి బాధితుడికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్, కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి హాస్టల్ గదిలో నలుగురు విద్యార్థుల మధ్య డబ్బు విషయమై వివాదం తలెత్తి ఘర్షణకు దారితీసినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనలో అనుదీప్ తలకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

యాజమాన్యం బాధ్యత నుంచి తప్పించుకోగలదా..?

హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి ఒక విద్యార్థి ప్రాణాపాయ స్థితికి చేరడం నిర్వహణ వైఫల్యంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థుల కదలికలపై పర్యవేక్షణ ఉందా? ఘర్షణను అడ్డుకునేందుకు సిబ్బంది ఏం చేశారు? ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగిందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

బాధిత విద్యార్థికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్య బాధ్యతను నిర్ధారించాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఘటనపై మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దాడిలో ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశంపై విచారణ కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన అనుదీప్ తల్లిదండ్రులు మానస, శ్రీనివాస్ తమ కుమారుడి పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, కౌశిక్, సాయిబాబు, అక్షయ్, అజయ్, ఈశ్వర్, జస్వంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, టీఆర్ఎస్వీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాల ఘటనపై కేసు నమోదు

శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌లో విద్యార్థిపై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి.జలంధర్ రెడ్డి తెలిపారు. గాయపడిన విద్యార్థి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, దాడికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1521/26గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 126(2), 115(2), 351(2) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వాతావరణ మార్పుల నియంత్రణలో భూగర్భ కార్బన్ నిల్వ అత్యంత కీలకం

- కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు శాస్త్రీయ పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం
- అనువైన భూగర్భ నిర్మాణాలను గుర్తించడం ద్వారా సురక్షితమైన కార్బన్ నిల్వకు అవకాశం
- డాక్టర్ ప్రకాష్ కుమార్

హబ్సిగూడ/ఉప్పల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణకు శాస్త్రీయ పరిష్కారాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎస్ఐఆర్–జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ) కీలకమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సీఎస్ఐఆర్ సమగ్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 26 నుంచి 30 వరకు భూగర్భ కార్బన్ నిల్వ ప్రదేశాల భౌగోళిక లక్షణాల నిర్ధారణపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టింది. కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఈ రంగంలో పనిచేస్తున్న నిపుణులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

కార్బన్ నిల్వకు అనువైన ప్రాంతాల గుర్తింపుపై శిక్షణ

పారిశ్రామిక కార్యకలాపాలు, ఇంధన వినియోగం తదితర కారణాలతో వెలువడే కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించడం ప్రపంచవ్యాప్తంగా కీలకమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించి, తగిన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో సురక్షితంగా భూగర్భంలో నిల్వ చేసే సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. అయితే ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే భూగర్భ నిర్మాణాల స్వభావం, వాటి లక్షణాలు, నిల్వకు అనుకూలత వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

14 మంది నిపుణులు, పరిశోధకులు, విద్యార్థుల భాగస్వామ్యం

ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన ఆరుగురు నిపుణులు, ఒక స్వతంత్ర సలహాదారు, ముగ్గురు పీహెచ్‌డీ పరిశోధకులు, నలుగురు మాస్టర్స్ విద్యార్థులు కలిపి మొత్తం 14 మంది పాల్గొన్నారు. వీరిలో నలుగురు మహిళలు, పది మంది పురుషులు ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఎన్‌పీసీఐఎల్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, కల్ప్రా టెక్ సొల్యూషన్స్, డ్రేక్ ఏఐ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, ఎన్ఐటీ కర్ణాటక, ఉస్మానియా విశ్వవిద్యాలయం తదితర సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన వారు ఈ శిక్షణలో పాల్గొన్నారు. పరిశ్రమల అనుభవం, విద్యాసంస్థల పరిశోధనా పరిజ్ఞానం ఒకే వేదికపైకి రావడం ద్వారా భూగర్భ కార్బన్ నిల్వ రంగానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన పెంపొందించుకునే అవకాశం కలుగుతోంది.

ఐదు రోజులపాటు కొనసాగుతున్న ఈ శిక్షణ ద్వారా పరిశ్రమల నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులకు భూగర్భ కార్బన్ నిల్వ రంగానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని మరింత విస్తరించుకునే అవకాశం లభిస్తోంది. దేశంలో కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతల అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం అందించడం, వాతావరణ మార్పుల నియంత్రణకు సంబంధించిన సాంకేతిక పరిష్కారాలపై అవగాహన పెంచడం వంటి లక్ష్యాల సాధనలో ఈ కార్యక్రమం దోహదపడనుంది.

ఫారం-18 దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

తాండూరు, అక్టోబర్ 29 (జనంసాక్షి) : తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) మాట్లాడుతూ ఫారం–18 ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన పట్టభద్రుల దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతకు సంబంధించిన వివరాలను ధృవీకరించాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 10 శాతం దరఖాస్తులను పరిశీలించి, పరిశీలన పూర్తయిన దరఖాస్తులను సంబంధిత ఏఈఆర్ఓ కార్యాలయానికి పంపించాలని తెలిపారు. భౌతికంగా స్వీకరించిన ఫారం–18 దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో అదే రోజు డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ధృవీకరించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాండూరు ఆర్డీవో కోరారు.

ఉపాధి పనులను వంద శాతం కల్పించాలి

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతు కూలీలకు విబిజీ రాంజీలో వంద శాతం ఉపాధి హామీ పనులు కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విబిజి రాంజీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి హామీ పనులపై కలెక్టర్ గురువారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతు కూలీలకు పెద్ద ఎత్తున జాబ్ కార్డులను అందజేసి గుర్తించిన పనులను చేయించాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు క్షేత్ర సహాయకులు పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, జెడ్పి డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, పలువురు జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు

తాండూరు, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో బషీరాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు. అందరం కలిసి పనిచేస్తాం. బషీరాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మనోహర్ రెడ్డి నాయకత్వంలో బషీరాబాద్ లో అభివృద్ధి పుంజుకుంది. రేపు జరగనున్న ఎమ్మెల్యే పర్యటనలో అందరం కలిసి పాల్గొంటాం. జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

ముషీరాబాద్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ బి. వెంకటరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ముఠా జయసింహాతో కలిసి అడిక్మెట్, రాంనగర్ ఈ–సేవ కేంద్రం, కవాడిగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో కొనసాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించి, నమోదు కోసం వచ్చిన వివరాలు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా, వేగవంతంగా కొనసాగేందుకు నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునేలా అవసరమైన అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వివరించారు. ఓటరు నమోదు కేంద్రాల వద్దకు వచ్చే వారికి అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తుల ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నమోదు శిబిరాలను సందర్శించడం ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనితీరును సమీక్షించిన బి. వెంకటరెడ్డి, నమోదు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో పైరవీల పర్వం

- ఉత్తర్వులు వచ్చినా కొందరు బదిలీ కాకపోవడంపై ప్రశ్నలు
- కలెక్టర్ ఆదేశాలు ఉన్నా పైరవీల మోకాలడ్డుతో డీఈఓ తాత్సారమా..?
- బషీర్‌మియాతాండలో 40 మంది
- విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయురాలతోనే బోధనా..?

యాలాల, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయుల సర్దుబాటుకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో వాటి అమలు ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాలాల మండలంలోని కోకట్ కాంప్లెక్స్ పరిధిలో నాలుగు పాఠశాలలకు సంబంధించి చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అసమానతలు ఉన్నాయనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఉత్తర్వుల ప్రకారం కొందరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లి కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించగా, మరికొందరికి ఉత్తర్వులు వచ్చినప్పటికీ బదిలీ కాకుండా కొనసాగుతుండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో పైరవీలకు తావిచ్చారా? లేక ఇతర పరిపాలనా కారణాలున్నాయా? అనే అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

40 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయురాలే బోధన

యాలాల మండలం బషీర్‌మియాతాండ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, వారిలో ఒకరు జిల్లా పాఠశాలల తనిఖీ విధులకు వెళ్లడంతో ప్రస్తుతం ఒక్క ఉపాధ్యాయురాలే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం . సుమారు 40 మంది విద్యార్థులకు ఆమె ఒక్కరే విద్యాబోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు, విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు కూడా పదవీ విరమణకు దగ్గరలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందించేందుకు అదనపు ఉపాధ్యాయురాలిని సర్దుబాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బషీర్‌మియాతాండ పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు దేవనూరు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలిని సర్దుబాటు చేయాల్సిన అంశం తెరపైకి వచ్చింది. అయితే ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైరవీల కారణంగానే ఉపాధ్యాయురాలి సర్దుబాటు వ్యవహారం నిలిచిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 40 మంది విద్యార్థుల విద్యాబోధనకు సంబంధించిన అంశం కావడంతో అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి, సర్దుబాటు ఎందుకు ఆలస్యమవుతోందో స్పష్టం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

ఉత్తర్వుల ప్రకారం బదిలీ ఏది..

కోకట్ కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రక్రియలో భాగంగా అగ్గనూరు పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు యాలాల పాఠశాలకు బదిలీ ఉత్తర్వులు జారీ కాగా, వారు యాలాల పాఠశాలలో బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం. అయితే, ఉత్తర్వుల ప్రకారం బదిలీ కావాల్సిన వారిలో కొందరు కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించగా, మరికొందరు మాత్రం ఉత్తర్వులు ఉన్నప్పటికి పాత పాఠశాల నుంచి రిలీవ్ కాకుండా కొనసాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకే సర్దుబాటు ప్రక్రియలో ఉత్తర్వులు పొందిన వారిలో కొందరు బదిలీపై వెళ్లి బాధ్యతలు స్వీకరిస్తే, మరికొందరు ఎందుకు బదిలీ కావడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వ్యక్తిగత పలుకుబడి, పైరవీల ప్రభావంతోనే కొందరు ఉత్తర్వుల అమలును అడ్డుకుంటున్నారా? లేక బదిలీ కాకపోవడానికి నిబంధనలపరమైన కారణాలున్నాయా? అన్నది విద్యాశాఖ అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఉత్తర్వులు జారీ చేసినప్పుడు వాటిని అందరికి ఒకే విధంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్ ఆదేశాల అమలులో డీఈఓ స్పందన ఏది..?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల లభ్యత, బోధనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే, ఒకవైపు బదిలీ ఉత్తర్వులు అమలవుతుండగా, మరోవైపు కొందరు బదిలీ కాకుండా కొనసాగడం, ఇంకోవైపు ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు విద్యాశాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రక్రియలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్షించాల్సిన అవసరం ఉంది.

జిల్లా యువజనోత్సవాల్లో శ్రీ అక్షయ విద్యార్థుల ప్రతిభ

- జానపద నృత్యం, వీధి నాటకం, కవిత్వంలో ప్రథమ స్థానం

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ చాటారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో బహుమతులు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందారు. పోటీల్లో భాగంగా జానపద నృత్యం, వీధి నాటక ప్రదర్శన, కవిత్వం విభాగాల్లో ప్రథమ స్థానం, చిత్రలేఖనంలో ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు జిల్లా అధికారులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. విద్యార్థులు సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, కరస్పాండెంట్ వీరప్ప, డైరెక్టర్ భానుచందర్ రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్ జోషి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి విజేతలను అభినందించారు.

30 తులాల బంగారం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

మెదక్, సెప్టెంబర్ 29 (జనం సాక్షి) : ఫేస్‌బుక్ మెసెంజర్‌లో చోరీకి స్కెచ్.. స్విఫ్ట్, ఇన్నోవాల్లో పరార్ ప్రతిభ కనబరిచిన పోలీసు బృందానికి రివార్డులు ప్రకటించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, బస్సు ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నిజాంపేట పోలీసులు రట్టు చేశారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా బస్సులో చోరీకి గురైన 30 తులాల బంగారు ఆభరణాల కేసును పోలీసులు సవాలుగా తీసుకుని ఛేదించారని, ప్రధాన నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. నల్గొండకు చెందిన సూరం స్నేహ ఆగస్టు 26న రాఖీ పండుగ సందర్భంగా తన 30 తులాల బంగారు ఆభరణాలను బ్యాగ్‌లో పెట్టుకుని నిజాంపేటలోని తన తల్లిగారి ఇంటికి బయలుదేరారు. నిజాంపేట చేరుకున్న తర్వాత బ్యాగ్‌లోని నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ మార్గదర్శకంలో, తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో రామాయంపేట సీఐ బి.

సైదా, నిజాంపేట ఎస్ఐ బి. రాజేష్‌లతో కూడిన ప్రత్యేక బృందాలు సమర్థవంతంగా పనిచేసి సరూర్‌నగర్‌కు చెందిన మేకల సంధ్య (30)ను అదుపులోకి తీసుకున్నాయని ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితురాలు తన తల్లి సతుపాటి రాధిక, బంధువు అక్షింతల సంధ్య, బండి మోజెస్, బండి దుర్గలతో కలిసి ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు వెల్లడైందన్నారు. చోరీ అనంతరం స్విఫ్ట్ కారు (టా టీఎస్ 08 జుఖీ ఈ ఎఫ్ 6174)లో హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడి నుంచి ఇన్నోవా క్రిస్టా (టీజీ 07 జి 1888)లో పరారైనట్లు తెలిపారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఠా సభ్యులు ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరస్పరం సంభాషించుకునేవారని, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమండ్రి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లోని బస్టాండ్లలోనూ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. నిందితురాలి నుంచి 4 బంగారు చైన్లు, 4 లాకెట్లు, 1 పుస్తెల త్రాడు, 13 ఉంగరాలు, 1 ప్లాటినం ఉంగరం, నల్లపూసల దండలు, కంకణాలు, గాజులు, కమ్మలు, చంపస్వరాలు, ముక్కెర, సిక పువ్వు తదితర సుమారు 25 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను అరెస్ట్ చేసేందుకు, మిగిలిన సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. బస్సులు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు ప్రజలు తమ విలువైన ఆభరణాలు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన రామాయంపేట సీఐ సైదా, ఎస్ఐలు రాజేష్, బాలరాజ్, ఐటీ కోర్ సిబ్బంది విజయ్, వెంకట్, మహేందర్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

పోక్సో కేసుల్లో శిక్షలు కఠినంగా అమలు చేస్తాం

- చేర్యాల జడ్జి బానోత్ శ్రీరామ్
- సురక్షిత్ బచ్పన్ అభియాన్ సురక్ష అవగాహన

చేర్యాల, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ఫోక్సో కేసుల్లో శిక్షలు కఠినంగా అమలు చేస్తామని చేర్యాల జడ్జి బానోత్ శ్రీరామ్ అన్నారు. చేర్యాల కోర్టు పరిధిలో గల కస్తూరిబా బాలికల కళాశాలలో బుధవారం సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు సురక్షిత్ బచ్పన్ అభియాన్ సురక్ష కార్యక్రమానికి స్థానిక జడ్జి బానోత్ శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరై ఫోక్సో కేసులో పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఫోక్సో కేసుల్లో శిక్షలు కఠినంగా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్, సీనియర్ న్యాయవాదులు భూమిగారి మనోహర్, న్యాయవాదులు పొన్నం సురేష్, నల్గొండ సంతోష్, గుస్క వెంకటేష్, నీరటి రాజలింగం, బైరగోని ప్రసాద్, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 29 (జనం సాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని 71 ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను గుర్తించి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేపట్టాల్సిన పనులు, వాటి పురోగతిని సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మౌలిక సదుపాయాలన్నీ కల్పించిన అనంతరం ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, ఆ శాఖ డిప్యూటీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలి

కొత్తపల్లి అక్టోబర్ 29 (జనం సాక్షి) : కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన బీఆర్ఎస్ కార్యకర్తలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, కందులు, పత్తి, వేరుశనగ తదితర పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించి ఆర్థికంగా అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రైతులతో మాట్లాడి వారికి ధైర్యం, చెప్పడంతో పాటు ప్రభుత్వం నుంచి తగిన భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే రైతులను సమీకరించి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బీఆర్ఎస్ కార్యకర్తలు హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నరసింహ, సుల్తాన్, కిరణ్, మొగిలి రెడ్డి, ఆంజనేయులు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడే అర్హత మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి లేదు

జడ్చర్ల, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. భూముల పైరవీలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ. 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, మూడా నిధులు రూ. 23 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొని ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి స్థలం

కేటాయిస్తే మళ్లీ నిర్మిస్తానని మాజీ ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఆరోగ్యశాఖ మంత్రిగా పని చేసినప్పుడు ఆసుపత్రి అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్‌ను కలిసినప్పుడు భూముల సమస్యల కోసమే ప్రయత్నించారని, నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్లకు వచ్చి ఏం ఇచ్చారని ప్రశ్నించడాన్ని తప్పుబట్టారు. ఉదండాపూర్ ప్రాజెక్టు కోసం తొలి విడతగా రూ. 150 కోట్లు (మొత్తం రూ. 651 కోట్లు), ఎస్డీఎఫ్ నిధుల ద్వారా ప్రతి గ్రామానికి రూ. 50 లక్షలు, ఊర్కొండ ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు, అంబేద్కర్ భవన్‌కు రూ. 1.95 కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. ఇన్ని నిధులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దసరా పండుగకు అతిథిగా వచ్చిన ముఖ్యమంత్రిని నిధులు అడగాలని సూచించడం సరికాదన్నారు. అభివృద్ధి పనుల ఆధారాలు, జీఓలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే వైఫల్యాలను ఎండగడతానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రీ సర్వే

- కలెక్టర్ ప్రతిమ సింగ్

టేక్మాల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : రీ సర్వేపై గ్రామ ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం టేక్మాల్ మండలంలోని ఏక్లాస్‌పూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం 718 ఎకరాల భూమికి రీ సర్వే నిర్వహించి, భూములకు పక్కాగా హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. భూ సమస్యలు ఉంటే ముందుగా నోటీసులు జారీ చేసి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు వివరించారు. ముందుగా గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, అటవీ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల భూములను సర్వే చేసిన అనంతరం పట్టా భూముల రీ సర్వే చేపడతామని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో భూ తగాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతోఉపయోగకరమైన కార్యక్రమమని,

గ్రామ ప్రజల సహకారంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసి రైతులకు అండగా ఉంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏడీ సర్వే కిషన్ మాట్లాడుతూ.. ఏక్లాస్‌పూర్ గ్రామంలో వారం రోజుల్లో రీ సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి భూకమతానికి పక్కాగా హద్దులు నిర్ధారించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు. ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి గ్రామస్తులకు ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ తులసీరామ్, గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గుండుమాల్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుండుమాల్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : నారాయణపేట జిల్లాలోని గుండుమాల్ మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, తహసీల్దార్ భాస్కరస్వామితో కలిసి 171వ సర్వే నంబర్‌లోని స్థలాన్ని పరిశీలించి, పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించారు. 2022 జూలై 23న గుండుమాల్ మండలం ఏర్పాటైనప్పటికీ ఇప్పటివరకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో ప్రజలు పోలీస్ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో సుమారు 14 గ్రామపంచాయతీలు ఉండటంతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరమని స్థానికులు కోరుతున్నారు. నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటైతే మండల ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువై, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం కానుంది. ఈ స్థల పరిశీలనలో డీఎస్పీ లింగయ్య, తహసీల్దార్ భాస్కరస్వామి, ఏఈ, కోస్గి సీఐ, మద్దూరు ఎస్సై, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి కొండపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

కొండపాక, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ఉమ్మడి కొండపాక మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, ఉమ్మడి మండలాల రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఉమ్మడి కొండపాక మండల కమిటీ వెలికట్ట ఎక్స్ రోడ్ వద్ద విలేకరులతో సిపిఎం ఉమ్మడి మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో కొండపాక, కుకునూరు పల్లి మండలాలు లేకపోవడం అన్యాయమని వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని మండలంలో వర్షపాతంత లేక ఎక్కడా నీళ్లు లేకుండా పోయాయన్నారు. మండలంలోని మల్లన్న సాగర్ ప్రాజెక్టు ఉందని అయినా పంటలకు నీరు అందడం లేదని ప్రాజెక్టులు నింపి రైతులకు నీరు అందించాలని అన్నారు. వర్షాలు కురవక కరెంటు సరిగ్గా రాకపోవడంతో పంటలు ఎండిపోయాయని వానకాల పంటలను రైతులు వేసిన సమయంలో ఎల్ లినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా పడలేదని వర్షపాతం తక్కువ నమోదు అయిందన్నారు. ఎల్నినోతో వత్తి పంటల దిగుబడి ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్ళ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పూర్తిగా అప్పుల ఊబిలో కోరుకుపోయినారని అన్నారు. వానకాలం పంటలను రైతులు వ్యయ ప్రయాసలు కోర్సునీ గట్టెక్కించుకోగా యాసంగిలో గుంట వరి పొలం కూడా పారదన్నారు.ప్రభుత్వం స్పందించి రైతుల యొక్క రుణలు మాఫీ చేయాలని కోరారు.వెంటనే ఉమ్మడి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి అర్హులైన రైతులకు నష్టపరిహారం,ప్రభుత్వ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉమ్మడి మండల కమిటీ సభ్యులు తటోజు రవీంద్రచారి, మూడోజు కనకచారి, నాయకులు భూమని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

టేక్మాల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.గురువారం టేక్మాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల సామర్థ్యం, హాజరు శాతాన్ని పరిశీలించారు.సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్‌కేర్, రిటైల్ వృత్తి విద్యా కోర్సుల తరగతులను సందర్శించారు.నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్‌ల పనులను పరిశీలించారు.అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ముఖ గుర్తింపు ఆధారిత హాజరు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్, ల్యాబ్ వసతులను పరిశీలించారు.ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర విద్యుత్ పరికరాలకు మరమ్మతులు అవసరమైతే వెంటనే చేయించాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, క్రీడల్లోనూ రాణించాలని ప్రోత్సహించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు.

రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం

- రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరి
- అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు
- సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

వనపర్తి, అక్టోబర్ 29 (జనం సాక్షి) : భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, పట్టా భూముల సర్వేకు ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి కొత్తకోట మండలం నాంచారంపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వేయర్లు భూములను సర్వే చేస్తున్న తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. తొలుత గ్రామ సరిహద్దులను గుర్తించి, అనంతరం ప్రభుత్వ భూములు, ఆ తర్వాత పట్టా భూముల సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు గుర్తిస్తే వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. పట్టా భూముల సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలను సంబంధిత రైతులకు తెలియజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. రీసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆరోగ్య కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి

అనంతరం కొత్తకోట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా

పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సుభాష్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ నియామక ఇంటర్వ్యూలు

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉట్నూర్ అక్టోబర్ 29 (జనంసాక్షి) : అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియమానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. మండలంలో ఖాళీగా ఉన్న వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ నియమానికి దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్యర్థులకు గురువారం కేబీ కాంప్లెక్స్ పిఏంఆర్సి సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో మంద మకరందు తో కలిసి ఆయన ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని, వాటిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం టీచర్, హెల్పర్ నియామకాలను చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి అభ్యర్థికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామన్నారు. ఉట్నూర్ మండలంలో 27 టీచర్ పోస్టులకు అర్హత సాధించిన 92 మందిలో 89 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పూర్తిగా మెరిట్, నిబంధనలకే పెద్దపీట వేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిడబ్లుఓ మిల్కా, డిఎంఎచ్ఓ డా.సాధన, సిడిపిఓలు, అభ్యర్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లాలో గుర్తించిన 20 బ్లాక్ స్పాట్లపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి ప్రమాదాల సంఖ్యను తగ్గించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, వాటిలో 17 జాతీయ రహదారులపై ఉన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎంజీఎం నుంచి వెంకట్రామ జంక్షన్ వరకు మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనుల వల్ల దెబ్బతిన్న రహదారిని తిరిగి యథాస్థితికి తీసుకురావాలని రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. రహదారి దెబ్బతినడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా, రహదారిని పునరుద్ధరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సంపేట ప్రాంతంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, ఆయా సమయాల్లో ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మద్యం దుకాణాల సమీపంలో భారీ వాహనాలను రహదారులపై పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నట్లు సమావేశంలో కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. ఈ రోడ్డు భద్రత కమిటీ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, నేషనల్ హైవే పిడి భరద్వాజ్, ఆర్ అండ్ బి ఇఇ రాజేందర్, సంబధిత ఏ సి పి లు, ట్రాఫిక్ అధికారులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారు, తదితర రోడ్ భద్రత కమిటీ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోలాంగూడలో కలెక్టర్ కాలినడక

- గిరిజనులకు వైద్య సేవలు
- పెద్దవాగు దాటి టీబీ ముక్త్ శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె.హరిత

కెరమెరి, అక్టోబర్ 29 (జనంసాక్షి) : టీబీ ముక్త్ జన్ జాతీయ అభియాన్ లో భాగంగా కెరమెరి మండలంలోని తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మారుమూల ఆదిమ గిరిజన గ్రామమైన కోలాంగూడ (దేవాపూర్) లో గురువారం సమగ్ర ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో, పిరమల్ స్వస్థ్యా ప్రభుత్వేతర సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నాగేంద్ర , ప్రోగ్రాం అధికారి డా. వినయ్ ఉప్రేలు పెద్దవాగు దాటి, కాలినడకన గ్రామానికి చేరుకుని ప్రారంభించారు. మారుమూల గిరిజన గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ స్వయంగా పెద్దవాగు దాటి కాలినడకన రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పెద్దవాగు వద్ద నుంచి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని చాటుకున్నారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా మారుమూల గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు అందించడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు డా. మురళీకృష్ణ, డా. రియాన్, సహాయ మలేరియా అధికారి ఇస్లావత్ శ్యాంలాల్, ఉప గణాంకాధికారి అవధానుల రమేష్, స్థానిక వైద్య సిబ్బంది, పిరమల్ స్వస్థ్యా సంస్థ అధికారులు, తుమ్మగూడ గ్రామ సర్పంచ్ కుంరం భీంరావ్ పటేల్, ఉప సర్పంచ్ ఆత్రం భారీక్ రావు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను సమర్థవంతంగా చేపట్టాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) : ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జి.ఓ. నం. 59, 76 అమలుపై జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, నిర్దేశిత గడువులకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టాలని సూచించారు. నిర్దేశిత కటాఫ్ తేదీకి ముందుగా జరిగిన ఆక్రమణలకు మాత్రమే, సంబంధిత జి.ఓ. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సందర్భాలలో క్రమబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. భూముల క్రమబద్ధీకరణకు ముందు సంబంధిత భూమి అటవీ భూముల పరిధిలోకి వస్తుందా/లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, అటవీ భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అంశాలను నిర్ధారించిన అనంతరమే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. జి.ఓ. నం. 59 ప్రకారం 500 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలు, అర్హతలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జి.ఓ. నం. 76కు సంబంధించి తహసిల్దార్లు, సింగరేణి అధికారుల సమన్వయంతో క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలని, సింగరేణి ఉద్యోగులు కాని వారు సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నట్లయితే, నిబంధనల ప్రకారం వాటిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగరేణి నిర్మాణాలలో నివాసం ఉంటున్న వారికి సంబంధిత మున్సిపాలిటీల ద్వారా ఆస్తి పన్ను విధించడం, ఇంటి నంబర్లు కేటాయించడం వంటి అంశాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి చర్యలు జరిగినట్లు గుర్తిస్తే, సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

వారసత్వ సంప్రదాయాన్ని చాటుతున్న భూలయి పండుగ

రెబ్బెన, అక్టోబర్29 (జనంసాక్షి): నెతకాని జాతి ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే భూలయి పండుగ గోలేటి అంబేద్కర్‌లో ప్రత్యేకతను సంతరించుకుంది. దసరా రోజున మొదలయ్యే ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు మహిళల భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతాయి. ఇందులో భాగంగా ఎనిమిదో రోజు పుట్టమట్టితో సంప్రదాయ బద్ధంగా 'బొండాయి బొండబా' దేవతా ప్రతిమలను రూపొందిస్తారు. తొమ్మిదో రోజు రాత్రి మహిళలంతా ఒకచోట చేరి పూజలు, ఆటపాటలతో జాగరణ చేస్తారు. అనంతరం మరుసటి రోజు ఉదయం దేవతా ప్రతిమలను సమీప జలాశయంలో నిమజ్జనం చేసి వేడుకలను ముగిస్తారు. పూర్వీకుల కాలం నుంచి వస్తున్న ఈ ఆచారం నేటికీ కొనసాగుతుండటం విశేషం. ఈ ఉత్సవాల ద్వారా మహిళలు తమ సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ, వాటిని భావితరాలకు అందిస్తున్నారు. భూలయి పండుగ నెతకాని జాతి ప్రజల ఆధ్యాత్మిక నమ్మకాలకు, సామాజిక ఐక్యతకు అద్దం పడుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

చెన్నారావుపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ- ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలో మెజార్టీ స్థానాన్ని చూపించాలన్నారు. అలాగే గ్రామాలలో పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని పట్టభద్రులంతా తమ ఓటు హక్కుతో కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాలలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైఫల్యాలను పట్టభద్రులకు వివరించి బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసే విధంగా ప్రతి ఒక్కరు అహర్నిశలు పాటుపడాలని సూచించారు. నర్సంపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి లేడని ఎవరు అధైర్య పడవద్దని నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, మాజీ జెడ్పిటిసి బానోతు పత్తి నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు కొండవీటి ప్రదీప్ కుమార్, అమ్మ రాజేష్, అనుముల కుమారస్వామి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కుండె మల్లయ్య, అమీనాబాద్ సొసైటీ మాజీ చైర్మన్ మురహరి రవి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ గఫ్ఫార్, సోషల్ మీడియా మండల ఇన్చార్జి బోడ మురళి నాయక్, సర్పంచ్ లు బుర్ర సుదర్శన్ గౌడ్, దారావత్ రమేష్, యాట సుధాకర్, పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, మెడబోయిన కుమార్, బాదావత్ వీరన్న నాయక్, బోడ సమ్మ నాయక్, భూక్య శ్రీనివాస్, మొగిలి కేశవరెడ్డి, పరకాల రాజన్న, గుర్రం రవి, మంతుర్తి అన్వేష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాను అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29(జనంసాక్షి): జిల్లా మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్ కార్ మాదకద్రవ్యాలను నియం త్రణపై నిర్వహించిన సమావేశానికి జిల్లా ఎస్.పి. నితికాపంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణా అరికట్టడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సాగు, రవాణాకు సంబంధించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని తెలిపారు. హోటళ్ళు, దాబా లలో తనిఖీలు చేపట్టాలని, మందుల షాపులలో నిషేధిత, అధిక మోతాదు మందులను పరిశీలించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పాఠశాలలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి తంబాకు రహిత విద్యాసంస్థలుగా మార్చాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ ఈ అక్టోబర్ నెలలో గంజాయి సాగు, రవాణాపై తనిఖీలు చేపట్టి 16 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి సాగు, రవాణా, మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా మాధ్యమిక విద్యాధికారి కళ్యాణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం

చిట్యాల అక్టోబర్ 29(జనం సాక్షి): భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిట్యాల మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గాంధీనగర్ (హెచ్/ఓ జదలపేట) గ్రామానికి చెందిన బోనగిరి తేజ (26)కు నాలుగేళ్ల క్రితం చేల్పూరుకు చెందిన స్పందనతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. నెల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో స్పందన పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పిలిచినా భార్య తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తేజ.. బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 11:05 గంటలకు మృతి చెందాడు. మృతుడి తండ్రి బోనగిరి భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..
- గణపురం మండలంలో రూ.1.49 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.49 కోట్లతో చేపట్టనున్న మహిళా సమైక్య భవనాలు, అంగన్ వాడీ భవనాల నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మారెడ్డిపల్లె, బుర్రకాయలగూడెం, చెల్పూర్ గ్రామాల్లో మహిళా సమైక్య భవనాలకు, గాంధీనగర్, గణపురం, చెల్పూర్ గ్రామాల్లో అంగన్ వాడీ భవనాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామ అవసరాలకు తగ్గట్టుగా గ్రామపంచాయతీ, అంగన్ వాడీ, సమైక్య భవనాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామీణాభివృద్ధిలో అంగన్ వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఒక్కో భవనానికి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కళ్లలో కారం చల్లి మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ!

- కామారెడ్డిగూడెంలో ఘటన..

దేవరుప్పుల, అక్టోబర్ 29 (జనం సాక్షి) దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఉదయం మహిళ మెడలోని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తి అపరిచిన ఘటన చోటు చేసుకుంది కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన తండ సుగుణమ్మ, భర్త రామస్వామి, ఇంటి వద్ద ఉండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి నల్లాల యాదగిరి ఎక్కడ ఉంటాడని అడిగాడు. అతని ఇల్లు కొత్త ఇండ్ల వైపు ఉంటుందని ఆమె సమాధానం ఇచ్చింది. అనంతరం సుగుణమ్మ నీళ్లు పట్టేందుకు బయటకు వెళ్లగా, కొంతదూరం వెళ్లిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తి ఆమె కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న బంగారు గొట్టాల గొలుసు, బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. అపహరణకు గురైన ఆభరణాల బరువు సుమారు మూడు తులాల పావు ఉన్నట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

దేవరుప్పుల, అక్టోబర్ 29 (జనంసాక్షి) : దేవరుప్పుల మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధికారులకు సూచించారు. పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతులపై సమీక్షించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి దేవరుప్పుల మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

మహాదేవపూర్, అక్టోబర్ 29 (జనంసాక్షి): జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి సమ్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు వైద్య చికిత్స నిమిత్తం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2 లక్షల 50 వేల విలువైన ఎల్‌ఓసీ మంజూరు చేశారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందుతున్న బాధితుడికి గురువారం మంత్రి శ్రీధర్ బాబు సహాయకులు మంజూరైన చెక్కును అందజేశారు. ఆర్థిక సహాయం అందడం కుటుంబ సభ్యులకు చికిత్సకు సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భద్రాచలం ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

- నెలకు రూ.2 లక్షల వేతనం.. నవంబర్ 4 వరకు గడువు

భద్రాచలం, అక్టోబర్ 29 (జనంసాక్షి) : భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిలో గైనకాలజీ వైద్య నిపుణురాలి పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ (డిసిహెచ్ఎస్) డాక్టర్ రవిబాబు తెలిపారు. ఎంపికైన వైద్య నిపుణురాలికి నెలకు రూ.2 లక్షల వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఓల్డ్ పాల్వంచలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, గది నంబర్ ఎస్-26లో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. పోస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను కొత్తగూడెం.తెలంగాణ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9347277353 నంబర్‌ను సంప్రదించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు సూచించారు.

అశ్వారావుపేటలో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

అశ్వారావుపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ స్థలాన్ని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన డివిజన్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, కార్యాలయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. అశ్వారావుపేట ప్రాంతంలో విద్యుత్ శాఖ పరిపాలనా కార్యకలాపాలకు అవసరమైన కార్యాలయ వసతుల కల్పనలో భాగంగా ఈ స్థల పరిశీలన చేపట్టారు. అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్‌కు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, జూపల్లి ప్రమోద్, మిశీడా హరిబాబు, వెలుపుల సత్యనారాయణ, దండ బత్తుల రమేష్, ఆకుల శ్రీను, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్య సేవలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- వెలువర్తి పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

వలిగొండ, అక్టోబర్ 29 (జనం సాక్షి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీలు నిర్వహించారు.పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, రోగుల వివరాల నమోదు, ల్యాబ్ పరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులకు టీకాలు, అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు అందించే విధానంపై వివరాలు తెలుసుకున్నారు. డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి రోగులకు సకాలంలో వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దుపల్లి లో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను గురువారం క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత సమయానికి, క్వాలిటీ తో వేగంగా నిర్మాణాలు జరగాలని, కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ విద్య, వైద్యం అభివృద్ధికి కీలకమైన కళాశాల భవనాల నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకుండా, ఇంజనీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల సందర్భంగా అవసరమైన నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, ప్రతి దశను ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం వెంకటగిరి లో అసంపూర్తిగా ఉన్న జి ప్లస్ 2 భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు వినయేందర్ రెడ్డి, వైద్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీడిన సామినేని రామారావు హత్య కేసు మిస్టరీ

- నలుగురు నిందితులను అరెస్ట్ చేశాం
- సీపీ సునీల్ దత్ ఐపీఎస్
- గుజరాత్ చీఖ్రీఖ, బెంగళూరు ల్యాబ్ నిపుణుల సాయంతో సాంకేతిక దర్యాప్తు
- నిందితుల నుంచి రెండు కత్తులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖమ్మం, అక్టోబర్ 29 (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు (72) హత్య కేసును ఛేదించి, నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఐపీఎస్ వెల్లడించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలతో అనుభవజ్ఞులైన పోలీస్ అధికారుల పర్యవేక్షణలో జరిపిన సమగ్ర దర్యాప్తు ద్వారానే ఈ కేసు కొలిక్కి వచ్చిందని ఆయన తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ సునీల్ దత్ వివరాలు వెల్లడించారు. వెల్లడించిన వివరాల ప్రకారం... చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సామినేని రామారావును 31.10.2025 తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంటి పక్కనే ఉన్న కొట్టంలో దారుణంగా హత్య చేశారని సీపీ తెలిపారు. దీనిపై చింతకాని పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 324/2025 కింద బి.ఎన్.ఎస్ సెక్షన్ 103(1), 190 లతో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు చెప్పారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ సైన్స్ బృందం ఘటనా స్థలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి చెప్పులు, కాలి ముద్రలు, ఎరుపు రంగు వస్త్రపు ముక్క, తెలుపు రంగుపై నల్లని గీతలున్న వస్త్రపు ముక్క మరియు కత్తి కవర్ లాంటి కీలక భౌతిక ఆధారాలు సేకరించినట్లు ఆయన వివరించారు.

శాస్త్రీయ దర్యాప్తు.. పాలిగ్రాఫ్ పరీక్షలు

ఈ హత్య కేసును శాస్త్రీయంగా ఛేదించేందుకు సాంకేతిక ఆధారాల విశ్లేషణను కీలకంగా తీసుకున్నామని సీపీ సునీల్ దత్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారు, సాక్షుల సమాచారం మేరకు గుర్తించిన 24 మందికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతి కోరగా, వారిలో ఆరుగురు స్వచ్ఛందంగా సమ్మతి తెలిపారన్నారు. ఆ మేరకు 2026 జనవరిలో కర్ణాటకలోని బెంగళూరు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అలాగే గుజరాత్ గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ నుంచి ఆరుగురు సభ్యుల నిపుణుల బృందాన్ని రప్పించి, ఘటనా స్థల ఆధారాలతో ఫోరెన్సిక్ విశ్లేషణ పూర్తి చేశామని స్పష్టం చేశారు.

అరెస్టయిన నిందితులు

లభించిన భౌతిక, సాంకేతిక ఆధారాల ఆధారంగా తెల్లారుపల్లి (ఖమ్మం రూరల్ మండలం) గ్రామానికి చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ ప్రకటించారు జోడపట్ల శ్రీనివాసరావు ఏ మెంటల్ శ్రీను (34) – వృత్తి: మేస్త్రీ పని, నివాసం: మాలముత్యాలమ్మ సెంటర్, నూకల లింగయ్య (43) – వృత్తి : వ్యవసాయం, నివాసం: చావడి సెంటర్ మల్లారపు లక్ష్మయ్య (24) – వృత్తి: పెయింటర్ పని, కొర్లపూడి ఉదయ్ కుమార్ ఏ రుక్మాన్ కుమార్ (39) – వృత్తి: పెయింటింగ్ పని నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించినట్లుగా భావిస్తున్న రెండు కత్తులు, రెక్కీ నిర్వహించేందుకు వాడిన నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంక్లిష్టమైన కేసును చాకచక్యంగా ఛేదించిన వైరా ఏసీపీ ఎస్. సారంగపాణి, వైరా సీఐ వై. వెంకట ప్రసాద్, ఎస్సైలు వీరేందర్, జి. నరేష్ మరియు దర్యాప్తు బృంద సభ్యుల ప్రతిభను సీపీ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించి, వారికి రివార్డులు అందజేశారు.

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.గురువారం ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

ఉపాధి హామీతో అదనపు పనిదినాలు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.308 కూలీతో ఎక్కువ పనిదినాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రాంతీయంగా వలస వచ్చే నైజీరియా కొంగల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే మొదటి, రెండో విడతల ఇళ్ల మంజూరు ప్రక్రియ పూర్తయిందని, మూడో, నాలుగో, ఐదో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటరు నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారు సైతం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారిని సంప్రదించడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, నీటిపారుదల శాఖ డీఈ రాజేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయ అధికారి సురేష్, స్థానిక సర్పంచ్ అరెంపుల మరియమ్మ, ఏఓ ఉమా నగేష్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నగదు చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

- 3 తులాల బంగారు గొలుసు, రూ.50 వేల నగదు చోరీ..
- చుంచుపల్లి చోరీ కేసుతోనూ సంబంధం

అశ్వాపురం, అక్టోబర్ 29 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతారామపురంలో వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారు గొలుసుతో పాటు రూ.50 వేల నగదు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. గొల్లగూడెం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.విచారణలో చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో చోరీకి సంబంధించి కూడా నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులతో వారిని మణుగూరు కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

పిల్లల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేట

- యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం ఒప్పందం
- క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందడుగు వేస్తుంది.పిల్లల హక్కుల పరిరక్షణ, వారి స్వేచ్ఛ, అభిరుచులు, ఆలోచనా విధానంపై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది.గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యాశాఖ క్లస్టర్, గ్రామస్థాయి రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.పిల్లల హక్కులు, మానసిక వికాసం, వారి ఆలోచనా సరళి, సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అధికారి పిల్లల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

చూపాలని సూచించారు. బాలలు తమ హక్కులను, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.పిల్లల్లోని నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, వారు స్వచ్ఛందంగా తమ ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.ఈ శిక్షణ సూర్యాపేటను ఆదర్శ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ట్రైని డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ తోటలు పరిశీలించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

వీణవంక, అక్టోబర్ 29 (జనం సాక్షి) : వీణవంక మండలంలోని గన్ముకుల, పోతిరెడ్డిపల్లి,రెడ్డిపల్లి,పలు గ్రామాల రైతుల ఆయిల్ పామ్ తోటలను గురువారం రోజున జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా సందర్శించారు.పంట సాగు విధానం దిగుబడి పెట్టుబడి ఖర్చులపై రైతులకు కలుగుతున్న ఆదాయము తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ చిత్ర మిశ్రానేరుగా గ్రామాల రైతులతో మాట్లాడి పంట సాగులో ఎదురవుతున్న సమస్యలు నిర్వహణ అవుతున్న ఖర్చులు ఎరువులు పురుగుమందులు వినియోగం పంట దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజులలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు వ్యవసాయ సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా సంబంధించిన అధికారులను తెలియజేశారు. ఈ సందర్భనలో వారి వెంట హుజురాబాద్ ఆర్డిఓ జల కుమారి, డిహెచ్ఎస్ఓ జగన్మోహన్ రెడ్డి, ఆయిల్ ఫెడరేషన్ డిఎం రోహిత్, ఏడిఏ సునీత,హార్టికల్చర్ అధికారి మధులిక,ఎంఏఓ భూమ్ రెడ్డి, తాసిల్దార్ రమేష్,ఆర్ఐ లు సతీష్, నరసయ్య,తోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ఖమ్మం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో పట్టణ ప్రణాళిక, భవన నిర్మాణ అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ఖమ్మం నగర పరిధిలో లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) క్రింద వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

అర్హులైన వారికి లేఅవుట్ అనుమతులు సకాలంలో మంజూరు చేయాలని, అనుమతుల కోసం వచ్చే దరఖాస్తుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత శాఖల అధికారులతో లేఅవుట్ అనుమతులపై సమీక్ష సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశాల్లో నీటిపారుదల శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని, చెరువులు, నీటి వనరుల పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి అనుమతులు మంజూరు కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భవన నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ

నగరంలో భవన నిర్మాణ అనుమతులను నిబంధనల ప్రకారం మాత్రమే మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. మంజూరైన అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు జరిగేలా టౌన్ ప్లానింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలకు నిబంధనల మేరకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వీలైనంత త్వరగా జారీ చేయాలని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించి, నగరంలో క్రమబద్ధమైన పట్టణ ప్రణాళిక అమలయ్యేలా చూడాలన్నారు.

ఖిల్లా రోప్‌వేకు అప్రోచ్ రోడ్డు.. బీసీ హాస్టళ్ల పనులు పూర్తి చేయాలి

ఖమ్మం ఖిల్లా రోప్‌వేకు చేరుకునేందుకు వీలుగా మెరుగైన అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న మూడు బీసీ హాస్టళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నగర అభివృద్ధికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org శుక్రవారం 30.10.2026

జీరో యాక్సిడెంటే లక్ష్యం

భూగర్భగనిలో అప్రమత్తంగా పనిచేయాలి: డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ

వకీల్ పల్లి భూగర్భ గనిలో భద్రతా ప్రమాణాలపై ఉన్నతస్థాయి తనిఖీ

యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)అక్టోబర్ 29: సింగరేణి కాలరీస్ సంస్థ రామగుండం రీజియన్ పరిధిలోని ఆర్జీ–2 ఏరియాకు చెందిన వకీల్ పల్లి (వీకేపీ) భూగర్భ గనిలో గురువారం ఉన్నతస్థాయి భద్రతా తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ రీజియన్–2 డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సగేష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ దీపక్ ప్రభాకర్ గనిని సందర్శించి భద్రతా ప్రమాణాలను విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గనిలోని సీఓ2 ప్లాంట్ పనితీరు, మెయిన్ ఫ్యాన్ హౌస్ వెంటిలేషన్ వ్యవస్థ సామర్థ్యం, కోల్ బంకర్ల నిర్వహణ తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భూగర్భంలో రూఫ్ సపోర్ట్ సిస్టమ్, గ్యాస్ మానిటరింగ్ విధానం, కార్మికులు పాటిస్తున్న భద్రతా నిబంధనలు, రోజువారీ బొగ్గు ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గనిలో భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్న అధికారులు, జీరో యాక్సిడెంట్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిరంతరం భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–2 ఏరియా జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్, వీకేపీ ఏజెంట్ నెహ్రూ, మేనేజర్ మల్లేశం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ విజయ్ కుమార్, సేఫ్టీ ఆఫీసర్ రామ్ కుమార్‌తో పాటు గని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించండి

మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వినతి

హుజురాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి)
హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు మంత్రి గారు వెంటనే కాల్ పర్ చేసి చర్యలు తీసుకోవాలి అధికారులకు హెచ్చరించారు. బుధవారం జరిగిన ఘటనతో పాటు ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీసుకెళ్లారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న వ్యవహారంపై, అలాగే వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరుగుతోందని రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందాల్సి ఉండగా, అవసరమైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి హుజురాబాద్ నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఇలాంటి సమయంలో ఓపీ సేవలు సక్రమంగా అందకపోవడం, స్కానింగ్ వంటి కీలక వైద్య పరీక్షల విషయంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళన కలిగించే అంశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఎన్నిసార్లు రివ్యూ మీటింగ్ లు పెట్టి చెప్పిన సిబ్బంది మారడం లేదు అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండాల్సిన పరిస్థితుల్లో, రోగులు ఇతర ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తే పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడు తుందని తెలిపారు. ముఖ్యంగా అత్యవసరంగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన రోగులకు ఇబ్బందులు కల గకుండా, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనుల సాధనకై నిరాహార దీక్ష

- పెద్దంపేట ఓవర్ బ్రిడ్జి, ఖుర్జీ భూములకు పట్టాలు ఇవ్వాలి
- అంతర్గాం- మంచిర్యాల గోదావరి వంతెన..
- ఇండస్ట్రియల్ పార్కు పనులు ప్రారంభించాలి

:కోరుకంటి చందర్ ప్రకటన

గోదావరిఖని, జనంసాక్షి : పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఖుర్జీ కమ్మి భూములకు పట్టాల జారీ, అంతర్గాం–మంచిర్యాల గోదావరి వంతెన నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు వంటి నాలుగు కీలక అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 2న అంతర్గాం మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రకటించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాలుగు కీలక అం శాలపై తక్షణమే స్పందించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని, ఖుర్జీ కమ్మి భూములకు పట్టాలు అందించడం ద్వారా భూ సమస్య పరిష్కారమ వుతుందని పేర్కొన్నారు. అంతర్గాం–మంచిర్యాల ప్రాంతాలను కలిపేలా గోదావరి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడ తాయని కోరుకంటి చందర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న ఈ నిరాహార దీక్షకు ప్రజలు, పార్టీ శ్రేణులు మద్దతు తెలపాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, కార్పొరేటర్ మేకల సమ్మయ్య, టీబీజీకేస్ నాయకులు నూనె కొమురయ్య, బుర్రి వెంకటేష్, పాలడుగు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- సమస్యలపై ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవరించుకోవాలి
- రామగుండం శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్

గోదావరిఖని, జనంసాక్షి : రామగుండం పట్టణంలో పలు డివిజన్లో గడపగడపకు తిరుగుతూ.. జరుగుతున్న అభివృద్ధిని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ పరిశీలించారు. ప్రతి గల్లీలో గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల కనీస రోడ్లు లేకుండా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేవని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రామగుండం నియోజవర్గం, పట్టణంలో ప్రతి గల్లీలో రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ , సెంటర్ లైటింగ్ పనులు జరుగుతున్న విషయం ప్రజలు గమనించాలన్నారు. అదేవిధంగా ఎక్కడెక్కడ అయితే మిగిలి ఉన్న రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే మొదలు పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడ్డ ప్రజలకు 200 యూనిట్ల విద్యుత్ మాఫీ చేసి సుమారు 80% మంది ప్రజలకు కట్టే విద్యుత్ బిల్లు ప్రభుత్వం భరిస్తుంది అని అన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు రాక ప్రజలందరికీ ఎంతో ఇబ్బంది పడ్డారని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైయస్ రాజశేఖర్రెడ్డి రేషన్ కార్డులు ఇచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు లేని వారందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వడం జరు గుతుంది అన్నారు. ఇల్లు లేని వారికి సొంత ఇంటి స్థలం ఉంటే ఐదు లక్షలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టించడం జరుగుతుంది అన్నారు, కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్,ఫ్రీ కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అనేక పథకాలు ప్రభుత్వం అర్హులైన వారికి అందించడం జరుగుతుంది అన్నారు. గత ప్రభుత్వ లో రామగుండం నియోజకవర్గని బొందల గడ్డ గా మార్చి కోట్ల కోట్లు దంచుకొని రామగుండం నియోజకవర్గ ప్రజలకు వెన్నుపోటు మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయోధ్య సింగ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ దీటి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు, కార్పొరేటర్ ముస్తఫా, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, స్థానిక ప్రజలు, తదితరులు ఉన్నారు.

రాజకీయ లబ్ధికోసమే 'సర్'పై దుష్ప్రచారం

- కాంగ్రెస్ నాయకుల తీరు సరికాదు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ సునీల్ రావు

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పూర్తిగా తగ్గిపోయింది ని, గతంలో 45 శాతంగా ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంక్ 20 శాతానికి పడిపోయిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఓటమే ఎదురుకావడంతో ఏం చేయాలో తోచక, గత నెల రోజులుగా 'ఎస్.ఐ.ఆర్ సాకుతో ఆందోళనకు తెరలేపారని మండి పడ్డారు. కరీంనగర్ లో గురువారం విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... గత కొంతకాలం ఈవీఎంల మీద నిరాధార ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలని డిమాండ్ చేసి పలు రాష్ట్రాల్లో 26 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి నాలుగు రాష్ట్రాల్లో కనీసం ఒక్క స్థానం కూడ దక్కలేదని ఎద్దేవ చేశారు. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగి ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ ఎన్నిక కూడ మోసం అంటారా? ఆ పార్టీ నాయకులు పునరాలోచన చేస్కోవాలని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతి సారి ఎస్ఐఆర్ పై ఆంధోళన చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకుల నైజాంగా మారిందని నిప్పులు చెరిగారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు దాదాపు 12 సార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, ఇందులో 10 సార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం గమనార్హం అన్నారు. చివరిసారి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరిగి 20 సంవత్సరాలు దాటిందని, 2004 తర్వత 2026 లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టి జాబితాను ప్రక్షాళన చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ రకరకాల ఆరోపణలు చేస్తూ, దుష్ప్రాచారం చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గు చేటని విరుచుకు పడ్డారు. ఎస్ఐఆర్ చేపట్టిన తర్వతా కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బిన్నమైన ఫలితాలు వెలువడ్డాయని, కేరళలో కాంగ్రెస్ పార్టీ, తమిళనాడు లో టీవికే మిత్రపక్షాలు అధికారంలోకి వచ్చినా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిషయం పై నోరు విప్పరుకానీ బీజేపి అధికారంలోకి వచ్చిన చోట మాత్రం నిరాధారణ ఆరోపణలతో దుష్ప్రాచారం చేస్తోందని దుయ్యబట్టారు. దేశ జనాభా 140 కోట్లలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలు సామాజిక పరిమాణం ప్రకారం ప్రతి వెయ్యి మందిలో ఏడాదికి 6.5 నుంచి 7.5 మంది మరణిస్తుంటారని, ఈ లెక్కన 140 కోట్ల జనాభాలో ప్రతి సంవత్సరం 80 లక్షల నుంచి కోటి మంది చనిపోతున్నారని తెలిపారు. వీరిలో 18 సంవత్సరాలు నిండిన ఓటర్ల సంఖ్య 80 నుంచి 85 శాతం ఉంటుంది. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో అలాగే ఉంటే కాంగ్రెస్ పార్టీకి గానీ, ఆందోళన చేస్తున్న ఇతర పక్షాలకు ఒరిగే లాభం ఏంటని ప్రశ్నించారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిర్గతపరచాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక నగరం నుంచి మరో నగరానికి షిఫ్ట్ అయిన కోట్లాది మంది ఓటర్ల విషయంలో, డూప్లికేట్ ఓటర్లను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం ఏమిటని, ఆ ఇబ్బంది ఏమిటో వారు ఎక్కడా చెప్పడం లేదని దాని ఆంతర్యం ఏంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లోనో, ఇంకెక్కడో ఆందోళనలు చేసుకోండి. కానీ సర్ మీద ఒక్క ఆధారం చూపించలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఉన్నాయని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్స్ వంగల పవన్, కొంపెల్లి రామణ్, బండారి వేణు, బండ రమణారెడ్డి, గాజ శివరాం, మేకల వెంకటేష్, కేపిపి చంద్ర, మాసం గణేష్, సోమిడి వేణు, పొన్నం మొండయ్య గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, బిజెపి నాయకులు కటకం లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పారమిత' ఉపాధ్యాయుడికి అరుదైన గౌవరం

దేశంలోని టాప్ -10 ఇన్నోవేటివ్ టీచర్లలో లలిత్ మోహన్ సాహుచోటు

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 29(జనంసాక్షి):స్థానిక కరీంనగర్ లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించాడు. కరీంనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ గా విధులు నిర్వహిస్తున్న లలిత్ మోహన్ సాహు దేశంలోని అత్యుత్తమ 10 మంది వినూత్న ఉపాధ్యాయులలో ఒకరిగా ఎంపికయ్యారు. అక్టోబర్ 28న న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో నిర్వహించిన జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలేలో ఆయనకు వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్ – 2026 ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా లలిత్ మోహన్ సాహు గుర్తింపు పొందడం విశేషం. ఇన్‌స్పైర్ మానక్ వంటి వేదికలతో పాటు జపాన్, అమెరికాలో నిర్వహించే అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల్లో విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించేలా ప్రోత్సహిస్తున్నారు. ఆయన సాధించిన ఈ ఘనత పాఠశాలకే కాకుండా కరీంనగర్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. లలిత్ మోహన్ సాహు ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనుకర్ రావు, వి. యు. యం. ప్రసాద్, రాకేష్, వినోద్ రావు, హన్మంత్ రావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది లలిత్ మోహన్ సాహును అభినందించారు.

స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది

స్ట్రోక్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో చేర్చడం వల్ల మెరుగైన ఫలితం

వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ లో అవగాహన కల్పించిన డాక్టర్ల బృందం

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి): స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత త్వరగా స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి తీసుకెళితే మెరుగైన ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు వెల్లడించారు. స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనదని, లక్షణాలు కనిపించిన వెంటనే స్పందించాలని సూచించారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంజయ్ కమిన్వర్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్ రెడ్డి పాల్గొని స్ట్రోక్‌పై అవగాహన కల్పించారు. మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల స్ట్రోక్ సంభవిస్తుందని వివరించారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి, కాలు కదల్చకపోవడం, మాట తడబడటం, అకస్మాత్తుగా చూపు మందగించడం, బ్యాలెన్స్ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడం, రక్తస్రావం జరగడం అనే రెండు ప్రధాన రకాలుంటాయని తెలిపారు. నాలుగున్నర గంటలలోపు సీటీ, ఎమ్మారై స్కాన్, క్యాథలాబ్ సౌకర్యమున్న స్ట్రోక్‌రెడీ ఆసుపత్రికి తీసుకువస్తే ఐవీ త్రోంబాలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డను కరిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్యం చేయడం వల్ల వైకల్యంతో పాటు ప్రాణాలకే ప్రమాదమన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని తెలిపారు. రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చన్నారు. అన్ని విభాగాల వైద్యులు, పరికరాలు సిద్ధంగా ఉన్న స్ట్రోక్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో వేగవంతమైన పరీక్షలు, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలు అందడం మూలంగా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులతో ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమావేశమై వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా వివరించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇండ్ల నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారుఇంచార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'జనంసాక్షి' కథనానికి స్పందన

ప్రమాదకరంగా మారిన కంక పొదల తొలగింపు

కమాన్‌పూర్ (జనంసాక్షి): రోడ్డును కప్పేస్తూ ప్రమాదకరంగా మారిన కంక పొదలను గురువారం కమాన్ పూర్ గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించే పనులు చేపట్టారు. "రోడ్డును కప్పేస్తున్న కంక పొదలు.. పొంచి ఉన్న రోడ్డు ప్రమాదాలు" అనే శీర్షికతో జనంసాక్షి లో ప్రచురితమైన కథనానికి కమాన్ పూర్ మండల ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి తో పాటు, ఎంపీడీవో ప్రియాంక, ఎంపీఓ సౌమ్య లు స్పందించారు. వారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి తుడిచెర్ల రాము జిపి సిబ్బందితో కంకపొదలను తొలగించే పనులను చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలు, ప్రయాణికులు 'జనంసాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్

మంథని, అక్టోబర్ 29, (జనంసాక్షి): 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోందని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ తెలిపారు. పుష్కరాలకు మరో ఎనిమిది నెలల గడువు మాత్రమే ఉన్నందున అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని, ఆలయ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ మాట్లాడుతూ.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంథనిలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున టైర్–1 కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పుష్కర ఘాట్‌ను విస్తరించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మంథనిలో కాశీ తరహాలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరి నదికి సప్త హారతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

ఓదెల, రామగుండంలోనూ పుష్కర ఘాట్లు

గోదావరి పుష్కరాల సందర్భంగా మంథనితో పాటు ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలకు వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పుష్కరాలకు మరో 8 నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంథని పుష్కర ఘాట్ పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయినందున త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
30 అక్టోబర్ 2026

మాదకద్రవ్య సరఫరా మూలాలపై ఉక్కుపాదం

- డ్రగ్స్ నెట్‌వర్క్‌ను సమూలంగా ఛేదించాలి
- పెడ్లర్లపై నిరంతర నిఘా.. ఆస్తుల సీజ్‌కు చర్యలు
- రామగుండంను మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దుతాం
- గంజాయికి అలవాటుపడిన 55 మంది యువతకు కౌన్సెలింగ్

గోదావరిఖని, అక్టోబర్ 29 (జనంసాక్షి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు సరఫరా వ్యవస్థ మూలాలను గుర్తించి సమూలంగా ఛేదించాలని తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఈగల్ టీమ్) ఎస్పీ గిరిధర్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఎన్‌డీపీఎస్ కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, దర్యాప్తు తీరు, గంజాయి సరఫరా మార్గాలపై సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పక్కా సాక్ష్యాధారాలు సేకరించాలని సూచించారు.
గంజాయి విక్రయదారులపై కేసులు నమోదు చేయడంతోపాటు వారికి మాదకద్రవ్యాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి, రవాణాకు ఉపయోగిస్తున్న మార్గాలేమిటనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేయాలన్నారు. పెడ్లర్ల నుంచి ప్రధాన సరఫరాదారుల వరకు మొత్తం నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని, అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు.
రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనల ప్రకారం నిందితులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి, చట్టప్రకారం సీజ్ లేదా ఫ్రీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కేసుల నమోదుతోపాటు సరఫరా మూలాల ఛేదన, యువతకు అవగాహన, అవసరమైన వారికి కౌన్సెలింగ్, పునరావాస సహాయం కీలకమని చెప్పారు. పోలీస్ స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్, ఈగల్ టీమ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
సమావేశం సందర్భంగా కమిషనరేట్ పరిధిలో గంజాయికి అలవాటుపడిన 55 మంది యువతతో సీపీ అంబర్ కిషోర్ ఝా, ఈగల్ టీమ్ ఎస్పీ గిరిధర్ మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధిపై దృష్టి సారించాలని సూచించారు. వ్యసనాలు ఆరోగ్యం, కుటుంబం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. అవసరమైన యువతకు పునరావాసం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో పోలీసు శాఖ సహకరిస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రజల నుంచి అందే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి అధికారులు, టాస్క్‌ఫోర్స్, ఈగల్ టీమ్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గన్నేరువరంలో ఎలుగుబంటి కలకలం

పరుగులు తీసి బావిలో దూకిన యువ రైతు

గన్నేరువరం, అక్టోబర్ 29 (జనంసాక్షి): గన్నేరువరం మండల కేంద్రంలోని యాసగుండ్ల ప్రాంతంలో బుధవారం ఎలుగుబంట్ల సంచారం కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన యువ రైతు ముడికే శ్రీనివాస్ వ్యవసాయ బావి వద్ద మోటారు ఆన్ చేసేందుకు వెళ్లగా.. అక్కడ తల్లి, మూడు పిల్లలు కలిపి నాలుగు ఎలుగు బంట్లు ఎదురయ్యాయి. ఒక్కసారిగా ఎలుగు బంట్లను చూసి భయంతో యువ రైతు పరుగులు తీశాడు. కొద్ది దూరం పరుగెత్తి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఎలుగుబంట్లు వెళ్ళిపోయిన తర్వాత, ఈత వచ్చిన కారణంగా బావి నుండి బయటపడ్డాడు. ఈత రాకపోతే ప్రాణాలకే ప్రమాదం జరిగేది. విషయం తెలుసుకున్న మిగతా రైతులు వచ్చి అతన్ని ఇంటికి తీసుకెళ్లారు. గత నెల రోజులుగా గన్నేరువరం మండలంలో ఎలుగుబంటి సంచారం ఎక్కువైందని, అధికారులు వెంటనే స్పందించి బోన్లు ఏర్పాటు చేసి ఎలుగుబంట్లను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

సింగరేణి ఆర్జీ.1 బిసి.. ఓబిసి కమిటీ నియామకం

గోదావరిఖని, జనంసాక్షి : బిసి అండ్ ఓబిసి అధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నల్లపూరి రమేష్ ఆదేశాల మేరకు ఆర్ జీ.1 ఏరియా బీసీ అండ్ ఓబిసి వైస్ ప్రెసిడెంట్ పెంచాల తిరుపతి,సెక్రటరీ బత్తుల పోశం, లైసెన్ ఆఫీసర్ పెరుమళ్ళ శ్రీనివాస్ బీసీ అండ్ ఓబిసి పిట్ కార్యదర్శిలను నియమించారు. జీడికె.1వ గని పిట్ కార్యదర్శి రాదండి బాలయ్య, జీడికే 2వ గని ఓవర్ మాన్ బండోజు సాయికుమార్, జీడికే 2ఏ గని జనరల్ అసిస్టెంట్ పల్లె ప్రసాద్ యాదవ్, జీడికే ఓసి.5 ఆపరేటర్ జనగామ శ్రీనివాస్, పిట్ కార్యదర్శిగా జీడికే 11వ ఇటి కార్యదర్శి పడాల వినయ్ కుమార్, ఓవర్మెన్ పిట్ కార్యదర్శిగా జీడికే 1, సిఎస్ పి, ఓవర్ మాన్ పిట్ కార్యదర్శి పి.మురళి, జీడీకే సివిల్ తోట చంద్రయ్య, జీడీకే ఏరియా హాస్పటల్ అడప కుమారస్వామి, వార్డ్ అసిస్టెంట్ పిట్ కార్యదర్శిగా జీడీకే ఏరియా వర్క్ షాప్ ఇండ్ల మల్లయ్య, టెండల్ పిట్ కార్యదర్శిగా జిఎం ఆఫీస్ కు కొత్త వడ్ల రాంబాబు, డిప్యూటీ సూపర్డెంట్ పిట్ కార్యదర్శిగా నియమించారు. బీసీ అండ్ ఓబిసి బలోపేతానికి అన్ని గనుల, డిపార్ట్ మెంట్ లలో బీసీ అండ్ ఓబీసీలకు రావలసిన న్యాయమైన హక్కుల కోసం పోరాటం, రోస్టర్ ఆధారంగా రావలసిన బీసీల ప్రమోషన్ల కోసం కృషి చేయటానికి పెద్ద మొత్తంలో ఈ కమిటీని నియమించమని తెలిపారు.

ఉస్మానియా యూనివర్సిటీలో రెండో రోజూ పెన్‌డౌన్-టూల్‌డౌన్

సికింద్రాబాద్, (జనం సాక్షి): ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పెన్‌డౌన్-టూల్‌డౌన్ సహాయ నిరాకరణ కార్యక్రమం రెండో రోజు గురువారం విజయవంతంగా కొనసాగింది. మొదటిరోజు కంటే అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, వివిధ పరిపాలనా విభాగాలు, క్యాంపస్, అనుబంధ కళాశాలలు, కామర్స్ కళాశాలలు, జిల్లా పీజీ కళాశాలలో నిరసనలు నిర్వహించారు. ఉద్యోగులకు వర్తించే పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వడంతో పాటు టైమ్ స్కేల్ ఉద్యోగుల ఈపీఎఫ్ బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి నిలిచిపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2023 నుంచి నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రూ.1,500 వార్షిక ఇంక్రిమెంట్‌ను బకాయిలతో సహా చెల్లించాలని, సుమారు 25 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వానికి సిఫార్సులు పంపాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు అనెక్సర్-1, అనెక్సర్-2 వివరాలను అక్టోబర్ 31లోగా ప్రభుత్వానికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమార్, ఆరు ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కల్లాలు శుభ్రం చేయకుండానే కొనుగోళ్లకు ఏర్పాట్లు.. రైతుల ఆగ్రహం
- కొనుగోలు కేంద్రాల వద్ద కల్లాలు శుభ్రం చేస్తాం..ఏపీఎం దేవరాజు

గంభీరావుపేట, జనంసాక్షి: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట రోడ్డులో హనుమాన్ టెంపుల్ ఎదురు గా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం పరిసరాలు ముళ్ల పొదలు, చెట్లతో నిండిపోయాయి. కనీసం కల్లాలను శుభ్రం చేయకుండానే కొను గోళ్లకు ఏర్పాట్లు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయిం చేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్రం పరిసరాల్లో ముళ్ల పొదలు, చెట్లు పేరుకుపోవడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలం లేక రైతులు ఆందో ళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయి లో అందుబాటులోకి రాకపోతే ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రం పరిసరాల్లోని ముళ్ల పొదలు, చెట్లను తొలగించి, కల్లాలను శుభ్రం చేయడంతో పాటు రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న చెట్లను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయిస్తామని ఏపీఎం దేవరాజు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడిక్కడే మృతి

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్

మహేశ్వరం, (జనం సాక్షి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫైర్ స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం 7:20 సమయంలో జరిగింది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం కేసీతాండకు చెందిన కేతావత్ రాహుల్ (21) ద్విచక్ర వాహనం (టీఎస్ 07 జీఎన్ 0329)పై వెళ్తుండగా ఫైర్ స్టేషన్ సమీపంలో(టీఎస్08 జెడ్ 0132) ఆర్టీసీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొన్నాడు. రాహుల్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండానే ఆకస్మాత్తుగా బస్సును ఆపడంతో ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు,స్థానికులు కొద్దిసేపు మహేశ్వరం మన్సాన్ పల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి పోలీసుల చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- అభివృద్ధి సమీక్షలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నీటి ఎద్దడి నివారణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై చర్చ

శంకరపట్నం అక్టోబర్ 29 జనంసాక్షి : గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శంకరపట్నం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి, వ్యవసాయ సమస్యలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు.
ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పంట మార్పిడికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొయ్యడ పరశురాములు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నీటి వనరులు అడుగంటిపోతున్నాయని, వాగులు, వంకలు ఎండిపోవడంతోపాటు బావుల్లోనూ నీటిమట్టం తగ్గుతోందని తెలిపారు. ఎల్ఎండీ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగి, సాగునీరు, తాగునీటి సమస్యలు కొంతవరకు తగ్గుతాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఎస్సారెస్పీ ద్వారా కనీసం ఒక టీఎంసీ నీటినైనా విడుదల చేయాలని మంత్రులు, అధికారులను పలుమార్లు కోరినప్పటికీ సాధ్యం కాలేదని తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి

నీటి కొరతతో ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సర్పంచులు తెలిపారు. శంకరపట్నం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.
దీనిపై మండల వ్యవసాయ అధికారి స్పందిస్తూ కరువు మండలాల ప్రకటనకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, సాగు విస్తీర్ణం, భూగర్భ జలమట్టం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటా రని వివరించారు. మండలంలో 50 శాతానికి పైగా సాగు జరిగిందని తెలిపారు. అయితే సాగు చేసిన పంటలు నీటి కొరతతో దెబ్బతింటున్నాయని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
సమీక్షలో భాగంగా ఆయిల్‌ఫామ్ సాగు విధానాలు, రైతులకు కలిగే ప్రయోజనాలు, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై అధికారులు వివరించారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, నీటి పొదుపు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాశ్, ఎంపీడీవో అనిత, తహసీల్దార్ సురేఖ, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

1 కోటి 23 లక్షలు అంజన్న హుండీ ఆదాయం

మల్యాల అక్టోబర్ 29 (జనం సాక్షి) : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామికి భక్తులు భక్తితో చెల్లించిన కానుకలను 29వ తేదీ గురువారం రోజున అధికారుల సమక్షంలో శివశక్తి సేవాసమితి మరియు శ్రీ శక్తి సేవా ట్రస్ట్ సభ్యులు 14 హుండీలు 76 రోజులవి లెక్కించగా 1,23,00,984 రూ నగదు,69 విదేశీ నోట్లు, వచ్చాయని,మిశ్రమ బంగారం,మిశ్రమ వెండి బ్యాగులో వేసి సీల్ చేసి తిరిగి ఉండిలో వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఈవో ఎస్.అంజనారెడ్డి,డివిజన్ పర్యవేక్షకుడు దేవాదాయ శాఖ రాజమొగిలి,ఏఈఓ హరినాథ్, పర్యవేక్షకుడు సునీల్,ప్రధాన అర్చకుడు అనిల్ కుమార్,మారుతి ప్రసాద్,పరిశీలకులు అశోక్, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్,ఆలయ సిబ్బంది, ఏఎస్ఐ,హోంగార్డ్స్ పోలీస్ మహిళా కానిస్టేబుల్, బ్యాంకు ఉద్యోగులు ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

పెగడపల్లిలో 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం

- గ్రిడ్‌కు అనుసంధానించిన అధికారులు
- పీఎం-కుసుమ్-ఏ పథకంతో రైతులకు ప్రయోజనం
- సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం తగ్గుతుంది
- స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తికి ప్రోత్సాహం

బోధన్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వ పీఎం-కుసుమ్-ఏ పథకంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ పరిధిలోని పెగడపల్లిలో ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్‌ను గురువారం 33/11 కేవీ పెగడపల్లి సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు. టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ పి.వి. రాజేశ్వరరావు సాంకేతికంగా ప్లాంట్‌ను ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా ప్రోత్సహించడం, సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన రైతు తిరుమలరెడ్డి ఝాన్సీలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులు వెంకటరమణ, ముక్తార్ మొహమ్మద్, కె. నగేష్‌కుమార్, బాలచందర్, మారుతితోపాటు గ్రామ సర్పంచి మద్ది రచన సుదర్శన్, ఉపసర్పంచి షబ్బీర్, గ్రామ పెద్దలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మేడిపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి): బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన నూతిపల్లి శివకుమార్ ఈ నెల 28న కొండాపూర్ గ్రామ శివారులోని శివ గంగ వద్ద బంధువుల పుట్టువెంట్రుకల కార్యక్రమానికి హాజరయ్యాడు. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు తన భార్యను చూసేందుకు భీమారం వెళ్తుండగా, గ్రామ శివారులో బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల ఐక్యతే లక్ష్యం

- జనాభా లెక్కల్లో వ్యత్యాసాలపై ఆవేదన.. ప్రత్యేక కార్పొరేషన్, నిధులు కేటాయించాలి
- దేశవిదేశాల్లోని వారందరికీ సభ్యత్వ నమోదు..
- సామాజిక హక్కుల సాధనకు సంఘటిత శక్తి అవసరం

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 29 (జనం సాక్షి): రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని రాధా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభాపై స్పష్టమైన గణాంకాలు సేకరించేందుకు ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న మున్నూరు కాపు నాయకులు సామాజిక వర్గ అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు. తమ అంచనా ప్రకారం మున్నూరు కాపుల జనాభా సుమారు 51 లక్షలు ఉండగా, గత కుటుంబ సమగ్ర సర్వేలో 28 లక్షలుగా నమోదైందని, తాజా కులగణనలోనూ తక్కువగా నమోదైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ జనాభాపై స్పష్టత రావాలంటే ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం, నిధులు కేటాయించాలని గతంలో ప్రజాప్రతినిధులు, మంత్రులను కోరినప్పటికీ హామీలు కార్యరూపం దాల్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బండి సంజయ్, గంగుల కమలాకర్, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, చల్లా హరిశంకర్ తదితర నాయకులు మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణతో పాటు దేశవిదేశాల్లో నివసిస్తున్న మున్నూరు కాపులందరికీ సభ్యత్వ నమోదు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం సుమారు పది నిమిషాలు కేటాయించి సభ్యత్వ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి రంగాల్లో ముందుకు సాగాలంటే సంఘటిత శక్తి అవసరమని పేర్కొన్నారు.
గతంలో వేములవాడలో మున్నూరు కాపు సత్రం నిర్మాణం, వివిధ జిల్లాల్లో సంఘాల ఏర్పాటు కోసం కృషి చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం మున్నూరు కాపు పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు కోల అన్నారెడ్డి, ఎర్రం రాజు రెడ్డి, నామిని సత్యనారాయణ, కాసరాజు పటేల్, జల్లోజి శ్రీనివాస్, డాక్టర్ సందీప్, పురెళ్ళ సరోజ, అరుణ, కుంట సుజాత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఒప్పందాలు అమలు చేయాలి

- నవంబర్ 4న జీఎం కార్యాలయాల ముట్టడి
- ప్రభుత్వ జోక్యంతో కార్మికులకు అన్యాయం
- మెడికల్ బోర్డు, డిపెండెంట్ ఉద్యోగాలు వెంటనే కల్పించాలి
- ఏఐటీయూసీ నేతలు సీతారామయ్య, రాజ్‌కుమార్



గోదావరిఖని, అక్టోబర్ 29 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో సింగరేణి కార్మికుల డిమాండ్లపై కుదిరిన ఒప్పందాలు అమలుకు నోచుకోవడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.
సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటును ఏడాది పాటు నిలిపివేయడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏఐటీయూసీ సమ్మె నోటీసులో ప్రధాన డిమాండ్‌గా చేర్చి, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఏరియా ఆసుపత్రిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, 1981 జనవరి ఒప్పందం ప్రకారం అర్హులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసులకు సంబంధించిన కార్మికుల డిపెండెంట్ల నియామకాలపై కమిటీ ఇచ్చిన నివేదికను అమలు చేయాలని కోరారు. సొంత ఇంటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని, నియామక పత్రాలు సిద్ధంగా ఉన్నప్పటికీ డిపెండెంట్లకు ఇవ్వకుండా నిలిపివేయడం సరికాదన్నారు. ప్రభుత్వ జోక్యంతోనే ఈ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆరోపించారు. 190/240 మస్టర్లు పూర్తి చేసిన జనరల్ అసిస్టెంట్ ట్రైనీలకు జనరల్ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అనవసర జోక్యాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న సింగరేణి వ్యాప్తంగా జనరల్ మేనేజర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మద్దె ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షుడు బోగ సతీష్‌బాబు, నాయకులు గండి ప్రసాద్, దొంత సాయన్న, ఎం.ఎ. గౌస్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, ఏ.వి.ఎస్. ప్రకాశ్, పడాల కనకరాజు, పర్లపెల్లి రామస్వామి, ఎర్రగొల్ల చేరాలు, బూడిద మల్లేష్, సిర్ర మైసయ్య, జనగామ జగదీశ్వర్, రాపోలు రాజేశ్వరరావు, మోరె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ మోటార్లు, కాపర్ వైర్లు చోరీ.. ఇద్దరి అరెస్టు

- మూడు మోటార్లు, ఆటో స్వాధీనం
- ఎనిమిది దొంగతనం కేసుల్లో నిందితులు
- రాత్రివేళ ఆటోలో తిరుగుతూ చోరీలు
- కొనుగోలుదారుల కోసం పోలీసుల దర్యాప్తు

కరీంనగర్ క్రైమ్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కరెంట్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కరెంట్ మోటార్లు, చోరీలకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌కు చెందిన వివర్ సాయికుమార్ (28), సుభాష్‌నగర్‌కు చెందిన వజీద్ పాషా (24) ప్రస్తుతం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలోని ఇంద్రమ్మ కాలనీలో నివసిస్తున్నారు. వీరిద్దరూ ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. రాత్రివేళల్లో ఆటోలో తిరుగుతూ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లు, వ్యవసాయ బావుల వద్ద ఉన్న కరెంట్ మోటార్లను చోరీ చేసి, గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించేవారని పోలీసులు తెలిపారు.
కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా మోటార్ల చోరీలు జరగడంతో పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారని పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూరు తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో వీరిపై మొత్తం ఎనిమిది చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. చోరీ సొత్తును కొనుగోలు చేసినవారి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు. అరెస్టులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

శేరిలింగంపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై
కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సమన్వయ సమావేశం

శేరిలింగంపల్లి ,అక్టోబర్ 29 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కో-ఆర్డినేటర్, వేములవాడ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ వేములవాడ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్ గౌడ్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునందన్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు మాట్లాడుతూ... పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతంచేసి, అర్హులైన ప్రతి ఒక్కరితో ఓటరు నమోదు ఫారమ్ ను పూర్తి చేయించి ఓటు హక్కు పొందేలా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. ప్రతి ఇరవై ఐదు మందికి ఒకరు లేదా ఇద్దరు ఇంచార్జిగా బాధ్యతలు తీసుకొని వారి ఓటు నమోదు నుండి ఎన్నిక జరిగే వరకు ఇంచార్జిగా వ్యవహరించాలని అలాంటప్పుడే గెలుపు సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యాలాలలో ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడి మృతి

యాలాల అక్టోబర్ 29 (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లాలోని యాలాల మండలంలోని తిమ్మాయపల్లి గేటు సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ట్యాంకర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరుగగా, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. మృతుడి వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

నివాస ప్రాంతంలో భారీగా టపాసుల
అక్రమ నిల్వ.. ఇద్దరి అరెస్ట్

భద్రతా ప్రమాణాలు బేఖాతరు.. 100 కిలోల బాణసంచా స్వాధీనం

బోడుప్పల్-జనంసాక్షి : నివాస ప్రాంతంలో ఎలాంటి భద్రతా చర్యలు పాటించకుండా భారీ మొత్తంలో టపాసులను నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. కాచవాని సింగారంలోని జయశంకర్ విగ్రహం సమీపంలో గురువారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో సుమారు 100 కిలోల బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బంది, పంచ సాక్షులతో కలిసి సదరు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 58 పెట్టెలు, ఇతర ప్యాకెట్లలో భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిల్వ ఉంచిన వివిధ రకాల టపాసులను గుర్తించారు. ఈ ఘటనలో కాచవాని సింగారానికి చెందిన ఏలగందుల స్వామి (31), ఉప్పల్‌లోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన జక్కుల శ్రీనివాస్ (36)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచనామా నిర్వహించి బాణసంచాను స్వాధీనం చేసుకున్న అనంతరం ఇద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు. అగ్నిప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించా రు. అనుమానాస్పద నిల్వలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి మరో రూ.5 కోట్లు

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 29 (జనం సాక్షి) : మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి త్వరలో మరో రూ.5 కోట్లు కేటాయిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కులాల్లో సంపన్నులుగా ఎదిగిన వారు కుల భవనాల నిర్మాణంతో పాటు పేదల విద్య, ఉద్యోగ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే, ఎంపీ కాలనీ క్లబ్‌లో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్ల నిధులు కేటాయించి, సంబంధిత ప్రొసీడింగ్స్ అందజేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కుల పెద్దలంతా ఐక్యంగా ముందుకు వచ్చి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు కులస్తులు కూడా విరాళాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి దానం నాగేందర్ మాట్లాడుతూ మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ప్రతిపాదిత నిధులు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్‌పర్సన్ బాలలక్ష్మి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ ఆర్టీసీ చైర్మన్ సోమవారం సత్యనారాయణ, డాక్టర్ పుంజాల వినయ్, రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం, ట్రస్ట్ బోర్డు సభ్యులు గాలి అనిల్ కుమార్, రౌతు కనకయ్య, మంగళారపు లక్ష్మణ్, సత్తు మల్లేశం, గ్లోబల్ మున్నూరు కాపు అడ్వైజర్ సంఘాని రజనీకాంత్, బుక్క వేణుగోపాల్, జేఎన్ వెంకట్, మిద్దెల జితేందర్, మణికొండ వెంకటేశ్వరరావు, ఎడ్ల రవి, బండి పద్మ, ఈసంపల్లి వెంకన్న, కేఎస్ ఆనంద్ తదితరులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మున్నూరు కాపు పెద్దలు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరం

రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ డీసీపీ శిల్పవల్లి కృతజ్ఞతలు

అమీర్‌పేట / పంజాగుట్ట / జనంసాక్షి : పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి ఘనంగా నివాళులర్పించే ఉద్దేశంతో పంజాగుట్ట పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలకు నివాళులర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొని తమ విలువైన రక్తాన్ని దానం చేసిన ప్రతి ఒక్కరికీ డీసీపీ శిల్పవల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా వాకథాన్

- మెదడు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన
- స్ట్రోక్ లక్షణాలను ముందుగానే గుర్తించాలి
- కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం

హైదరాబాద్/రాయదుర్గం, అక్టోబర్ 29 (జనంసాక్షి): ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా మెదడు ఆరోగ్యం, పక్షవాతం నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుధవారం మల్కం చెరువు పార్కులో వాకథాన్ నిర్వహించారు. 'మీ మెదడు ఆరోగ్యం కోసం సరైన అడుగు వేయండి', 'ప్రతి నిమిషం విలువైనదే' అనే నినాదాలతో కార్యక్రమాన్ని చేపట్టారు. స్ట్రోక్ ముప్పును తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యసేవలు పొందడం ఎంత ముఖ్యమో వివరించారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్ట్రోక్ లక్షణాలను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి పోటీలకు బయలుదేరిన తెలంగాణ సెస్టోబాల్ జట్లు

కమాన్ పూర్, అక్టోబర్ 29, (జనంసాక్షి) : 7వ జాతీయ స్థాయి జూనియర్ సెస్టోబాల్ ఛాంపియన్ షిప్‌కు తెలంగాణ బాల బాలికల జట్టు వారణాసికి బయలుదేరి వెళ్లాయి. తెలంగాణ జట్టులో ఆర్పి పురాన్, డి.అక్షర, బి రుచిత, బి.సుచిత్ర, జంగిలి మనీ మోక్ష, వంశిక, జి సాత్విక, జయశ్రీ నిత్య, మనో వర్షిని, అదృష్ట రెడ్డి, ఆరాధ్య, సిహెచ్ హాసిని అలాగే బి అక్షిత్, ఆర్ నదీష్, డి రోహిత్, కే సంతోష్, ఏ సత్య వర్ధన్, కే అజయ్, హనుమాన్ సాయి, అన్విష్, హిమాన్షు, మోక్షిత్, కుదుస్, వరుణ్, విజయ్, సౌమిత్, దత్రికీక్, హర్షిత్, ఎం ఆదర్శ్14 మంది బాలురు, 14 మంది బాలికలు ఉన్నారు. నవంబర్ 1తేదీ నుండి 3న తేదీ వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి కేసి మెమోరియల్ స్కూల్లో జరిగే పోటీలలో రాష్ట్ర జట్లు ప్రాతినిధ్యం వ్యవహరిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జక్కుల దామోదర్ రావు,ఓదెలు యాదవ్ తెలిపారు. అలాగే ఆరవ ఫెడరేషన్ కప్ పోటీలకు కూడా తెలంగాణ రాష్ట్ర జట్టు క్వాలిఫై అయినా పురుషుల జట్టు వేద వ్యాస్, బాలరాజు, శివ ప్రణవ్, కృష్ణ సాయి, నాగచైతన్య, సాయి చరణ్ లాల్, అభినవ్, కార్తీక్, వెంకటేష్, అభిలాష్, నిద్దన్ రెడ్డి, కాదాసు అనిల్, ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నట్లు కోచ్ అనిల్, నవీన్, అక్షయ్,యశ్వంత్, భీమేష్ తదితరులు తెలిపారు.

ఆధార్ సేవలు.. ఇక స్థానికంగానే అవకాశం

- కామారెడ్డిలో నూతన సేవా కేంద్రం ప్రారంభం
- కొత్త నమోదు, వివరాల సవరణకు సౌకర్యం
- దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తొలగింపు
- నిర్దేశిత రుసుములే చెల్లించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 29 (జనంసాక్షి): ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుతో ప్రజలకు స్థానికంగానే మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో బావార్చి హోటల్ పక్కన భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ సేవలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు, వాటిని సులభంగా, పారదర్శకంగా అందించేందుకు కేంద్రాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. గతంలో కొన్ని సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం తెలంగాణలో 14 ప్రాంతాల్లో కొత్తగా ఆధార్ సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాస తగ్గుతుందన్నారు.

కొత్త ఆధార్ నమోదు, కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీ తదితర వివరాల సవరణకు నిబంధనల మేరకు అవకాశం ఉంటుందని వివరించారు. సేవల కోసం వచ్చే వారు సంబంధిత గుర్తింపు, చిరునామా, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. యూఐడీఏఐ నిర్ణయించిన రుసుములనే చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ తదితర సేవలకు ఆధార్ వివరాలు అవసరమవుతున్నందున, వాటిని సక్రమంగా ఉంచుకోవాలని, నూతన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆధార్ ప్రాధికార సంస్థ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి రత్నాకర్, కామారెడ్డి ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ అనిల్, నిజామాబాద్ జిల్లా ఆపరేషన్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం 'చలో ఢిల్లీ'

డిసెంబర్ 1 నుంచి 3 వరకు కార్యక్రమం

రంగారెడ్డి, అక్టోబర్ 29 (జనంసాక్షి): కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం జరిగిన రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడు తూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనం రూ.42 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. జగదీష్‌ను నూతన జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. మల్లికార్జున్, సహాయ కార్యదర్శి జి. కవిత, జిల్లా అధ్యక్షుడు జే. రుద్రకుమార్, డి. కిషన్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువకుడి అరెస్ట్

వ్యక్తిగత ఫొటోలతో బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు

యువతి ఫిర్యాదుతో కేసు నమోదు..నిందితుడిని రిమాండ్‌కు తరలించిన మాదాపూర్ పోలీసులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి): ప్రేమ పేరుతో యువతిని వేధిస్తూ, వ్యక్తిగత ఫొటోలతో బెదిరింపులకు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై ఓ యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం ప్రాంతానికి చెందిన నూతిగట్టు వీర వెంకట సంతోష్ దుర్గ (27) నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 25లో నివాసముంటూ ఏఎంఆర్ గ్రూప్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2022లో దూరపు బంధువైన ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో కొంతకాలం సన్నిహితంగా మెలిగారు. ఈ క్రమంలో యువతికి తెలియకుండా వ్యక్తిగత ఫొటోలు సేకరించి, వాటిని చూపిస్తూ ఆమెను వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో యువతి అతడికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. అయితే, తన మాట వినకపోతే వ్యక్తిగత ఫొటోలను బంధువులు, స్నేహితులకు పంపిస్తానని బెదిరించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో 2025లో యువతి గచ్చిబౌలి షీ టీమ్‌ను ఆశ్రయించగా, ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై యువతికి దూరంగా ఉంటానని నిందితుడు రాతపూర్వకంగా హామీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. అయినప్పటికీ వివిధ ఫోన్ నంబర్లతో యువతిని సంప్రదిస్తూ, ఆమె పనిచేసే సాఫ్ట్‌వేర్ కంపెనీ వద్దకు వెళ్లి వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 27న రాత్రి విధులు ముగించుకుని బయటకు వస్తున్న యువతిని కంపెనీ వద్ద అడ్డుకుని తనతో కలిసి రావాలని బెదిరించినట్లు సమాచారం. దీంతో భయాందోళనకు గురైన యువతి బుధవారం మాదాపూర్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

గదిలో చిక్కుకున్న బాలుడిని రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైమ్, అక్టోబర్ 29 (జనంసాక్షి): కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో గదిలో చిక్కుకున్న 18 నెలల బాలుడిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ఆడుకుంటూ గదిలోకి వెళ్లిన చిన్నారి తలుపు వేసుకోవడంతో లోపలే ఉండిపోయాడు. కుటుంబసభ్యుల సమాచారంతో ఎస్ఎఫ్ఓ కె. నరేశ్‌కుమార్ నేతృత్వంలోని సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తలుపు తెరిచి బాలుడిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. దీంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

భూ రీ సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

భూ ఆధార్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో భూముల గుర్తింపు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ పి.విజయేందర్ రెడ్డి గురువారం పరిశీలించారు. మేడ్చల్ మండలం డబీల్‌పురా గ్రామంలో జరుగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాస్‌బుక్‌లోని భూ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి లొకేషన్ ను గుర్తిస్తున్నట్లు మండల తహసీల్దార్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరుపై రైతులతో మాట్లాడి, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఆర్ఐ కుమార్, సర్వే బృందం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 ఆఖరు గడువు

నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే దరఖాస్తు చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, (జనంసాక్షి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. చిలకనగర్ చౌరస్తాలో గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హత ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోకపోతే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా పట్టభద్రులు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా తమ పేర్లను జాబితాలో చేర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఓటరు నమోదు దరఖాస్తుల సమర్పణకు నవంబర్ 6వ తేదీ చివరి గడువుగా ఉందని, ఆలోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. చిలకనగర్, పరిసర ప్రాంతాల్లోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు విధానం, దరఖాస్తుల సమర్పణ, గడువుపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

చిల్కానగర్ అభివృద్ధికి రూ.49.75 లక్షలు

- పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన
- సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు శ్రీకారం
- కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేస్తాం: బన్నాల గీత

ఉప్పల్, అక్టోబర్ 29 (జనంసాక్షి): ఉప్పల్ నియోజకవర్గంలోని ఉమ్మడి చిల్కానగర్ డివిజన్‌లో రూ.49.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి వివిధ కాలనీల్లో పనులను ప్రారంభించారు. బీరప్పగడ్డ డివిజన్ ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, సాయిరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో పెండింగ్ పనులు, చిల్కానగర్ ఆదర్శ్‌నగర్ కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్, బొడ్రాయి వెనుక వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు 85 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను ఎమ్మెల్యే సహకారంతో దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ట్రాఫిక్ కష్టాల నివారణకు ప్రత్యామ్నాయ రహదారులు
- రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి
- బాధితులకు న్యాయం.. టిడిఆర్ ప్రక్రియ వేగవంతం
- సీఎంసీ కమిషనర్ సృజనకు పీఏసీ చైర్మన్ గాంధీ సూచన



శేరిలింగంపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ సూచించారు. గురువారం మాదాపూర్‌లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సృజనతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయ రహదారులు, లింక్ రోడ్ల నిర్మాణంతో పాటు రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని గాంధీ సూచించారు. మసీదుబండ, తారానగర్, శ్రీదేవి థియేటర్, మియాపూర్ చౌరస్తా, అంజయ్యనగర్, కాజాగూడ, ఐఐటీ రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోతున్న వారికి సముచిత న్యాయం చేయాలని, టిడిఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. గంగారం చెరువు నుంచి జాతీయ రహదారిపై ఉన్న అపర్ణ హిల్‌పార్క్ వరకు లింక్ రోడ్డు టెండర్ పూర్తయినందున పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమయం, ఇంధన వినియోగం తగ్గుతాయని పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీలో పైప్‌లైన్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గాంధీ ప్రతిపాదనలపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించి, పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు పీఏసీ చైర్మన్ తెలిపారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ సీసీపీ వెంకన్న, ప్రాజెక్ట్స్ సీఈ శ్రీలక్ష్మి, ఈఈ గోపాల్, సీఎంసీ ఎస్ఈ శ్రీకాంతిని, భూసేకరణ అధికారి అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో క్వార్టర్ల కేటాయింపు.. పారదర్శకంగా కౌన్సిలింగ్

సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగులకు నివాసాల కేటాయింపు

యైటింక్లైన్ కాలనీ అక్టోబర్ 29 (జనంసాక్షి): సింగరేణి ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఆర్జీ-2 ఏరియాలోని సెక్టార్-3 కాలనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపునకు గురువారం పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్జీ-2 ఏరియా, ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1, ఆర్జీ-1 ఏరియాలోని జేడీకే-11 ఇంక్లైన్‌కు చెందిన గ్రూప్-1 పరిధిలోని అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారు. యైటింక్లైన్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌కు సెక్టార్-3లోని 502 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, మొత్తం 90 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన నిర్వహించిన కౌన్సిలింగ్‌కు 27 మంది ఉద్యోగులు హాజరయ్యారు. వీరిలో 17 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఓ టు జీఎం మాలోతు రాముడు మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్‌ను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా సీనియారిటీ ప్రాతిపదికన నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి పని సామర్థ్యం పెరిగి, సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ గంధం సాంబశివరావు, సీనియర్ పీఓ (ప) సింగ్ శ్రీనివాస్, సివిల్ ఈఈ సోనియా, క్వార్టర్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ మమత, షిఫ్ట్ జమేదార్ తక్కళ్ల రాములు, క్వార్టర్ సెక్షన్ గార్డ్ రాజ్‌కుమార్, సేవాసమితి కో-ఆర్డినేటర్ గొర్రె అనూష తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
30 అక్టోబర్ 2026

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి

- 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026' కర్టెన్ రైజర్‌లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (జనంసాక్షి) : సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా... ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026' కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది 'తెలంగాణ రైజింగ్' విజన్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతలను వివరించి పారిశ్రామికవేత్తలను 'రైజింగ్ తెలంగాణ విజన్ లో భాగస్వామ్యం చేసేందుకే ఢిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026' కర్టెన్ రైజర్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.0లో పాల్గొనాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలను కోరారు.

ఖేలో ఇండియా గేమ్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

క్రీడాకారులకు ప్రపంచస్థాయి సదుపాయాలు కల్పించాలి..

- ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి
- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా
- ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని కోరిన మంత్రి వాకిటి శ్రీహరి
- క్రీడా రంగంలో తెలంగాణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా కార్యాచరణ

న్యూఢిల్లీ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా గేమ్స్ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాతో న్యూఢిల్లీలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని, రాష్ట్రంలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను కేంద్ర మంత్రితో చర్చించారు. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, దేశవ్యాప్తంగా క్రీడాకారులు, క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా సూచించారు. ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత సమయంలో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ అనేది కేవలం క్రీడా పోటీలకే పరిమితం కాకుండా, రాష్ట్ర క్రీడా సామర్థ్యాన్ని దేశానికి పరిచయం చేసే గొప్ప అవకాశమని ఈ సందర్భంగా చర్చించారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారులకు వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లు, పోటీల నిర్వహణకు అవసరమైన సిబ్బంది సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పోటీల నిర్వహణలో పారదర్శకత, సమయపాలన, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఖేలో ఇండియా ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రిని ఆహ్వానించాలి : వాకిటి శ్రీహరి

ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను ప్రత్యేకంగా కోరుతూ, తెలంగాణలో జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ప్రారంభోత్సవానికి హాజరైతే ఖేలో ఇండియా గేమ్స్‌కు మరింత జాతీయ ప్రాధాన్యత లభిస్తుందని, దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తి కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. క్రీడలను ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అనుగుణంగా తెలంగాణలోనూ క్రీడా సంస్కృతిని మరింత విస్తరించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక సదుపాయాలను దేశానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన సమగ్ర ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర మంత్రికి వివరించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి రూపొందించిన కార్యాచరణ, క్రీడా వేదికల సన్నద్ధత, అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, క్రీడాకారులకు కల్పించాల్సిన సదుపాయాలు తదితర అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు, ప్రతిభావంతులైన యువతకు తగిన ప్రోత్సాహం కల్పించడం ద్వారా తెలంగాణను క్రీడా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఈ ప్రత్యేక సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర క్రీడల శాఖతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితో ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

ఆర్‌కె పురం చెరువు ఆక్రమణలకు హైడ్రా అడ్డుకట్ట

- 12 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధిని కాపాడుతూ ఫెన్సింగ్

హైదరాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : నగరంలో మినీ ట్యాంక్‌బండ్‌గా ఆర్.కె.పురం చెరువు(ముక్కిడికుంట) పేరుగాంచింది. ఈ చెరువు కబ్జాలకు హైడ్రా గురువారం చెక్ పెట్టింది. 12 ఎకరాల మేర ఆక్రమణలను తొలగించి కంచె వేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఎవరికి వారు ప్రీకాస్ట్ వాల్స్ నిర్మించుకుని, కంచెలు వేసుకుని తలా కొంత అని పంచేసుకున్నట్టు జరిగిన కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. ఆక్రమణలకు పాల్పడి కబేలాలుగా వినియోగించుకుని.. చెరువులోకి వ్యర్థాలను పారబోసిన వారిని నియంత్రించింది. ప్రికాస్ట్ వాల్స్‌తో వేసిన ప్రహరీలను తొలగించింది. చెరువులో మున్ముందు ఆక్రమణలకు ఆస్కారం లేకుండా హైడ్రా గురువారం ఫెన్సింగ్ వేసింది. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ భూములుగా సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం, మౌలాలి సర్కిల్ పరిధిలోని ఆర్.కె. పురం చెరువు మొత్తం 75 ఎకరాలు. ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. ఇందులో 11 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు వచ్చేశాయి. మరో 12 ఎకరాల మేర ఆక్రమణల పర్వం మొదలైంది. చెరువు పరిధిలో పందుల వధశాల నిర్వహణ, వ్యర్థాల వల్ల కాలుష్యం, నిర్మాణాల అంశాలపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించిన హైడ్రా గురువారం ఆక్రమనలు తొలగించి.. చెరువు పరిధిని కాపాడుతూ ఫెన్సింగ్ వేసింది.

పరువు హత్యలపై సంధించిన అస్త్రం

'పరువు తండ్రి - ఎరువు భర్త' నవల ఆవిష్కరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : సతీష్ చందర్ పరువు హత్యలపై రాసిన నవల భారతీయ సాహిత్యంలోనే తొలి నవలగా నిలిచి పోతుందని పలువురు సాహితీ వేత్తలు, ప్రొఫెసర్లు తెలిపారు. తెలుగు సాహిత్యంలో వ్యంగ్యరచనలో సతీష్ చందర్ అగ్రగణ్యులుగా నిలిచారన్నారు. ప్రతినిత్యం పెరుగుతున్న పరువు హత్యలపై తాత్విక దృష్టితో సంధించబడ్డ తొలి వ్యంగ్యనవలగా సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం సాయంత్రం సతీష్ చందర్ రాసిన "పరువుతండ్రి - ఎరువుభర్త" నవలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు కులపీడితుల మధ్య వైరాన్ని ఆదిపత్యకులాలు ఏ విధంగా సృష్టిస్తాయో వివరించారన్నారు. ఈ నవలలో తాత్వికతతో పాటుగా హింస, ట్రాజెడియన్ పాత్రలను గొప్పగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఈ సభకు అధ్యక్షతవహించిన తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ కులం ఎంతబలంగా నేటి సమాజంలో కూడా కొనసాగుతుందో ఈ నవలలో పాత్రలద్వారా రచయిత తెలిపారన్నారు. ఆస్తికి వారసుడిగా కొడుకును, పరువుకు వారసురాలిగా కూతుర్ని చూడటం అన్యాయమని ఈ నవలలో పాత్రల ద్వారా చెప్పిస్తారన్నారు. నవలను చదువుతుంటే దృశ్యం చూస్తున్నట్లుగా, దృశ్యకావ్యంగా మలిచి పాఠకుల ముందు నిలిపారని వివరించారు. ప్రధానవక్త, ప్రముఖ రచయిత్రి కుప్పిల పద్మ మాట్లాడుతూ కులం పేరుతో స్త్రీ స్వేచ్ఛను హరించటం అన్యాయమన్నారు. స్త్రీ తన హక్కుల కోసం స్వేచ్ఛ తీసుకునే తరుణంలో ఆమె హక్కులను పరువు హత్యల పేరుతో హరించి వేస్తున్నారన్న ఆవేదనను సతీష్‌చందర్ నవలలో అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. స్త్రీవాద దృక్పథంతో నవలలోని పాత్రలను ఆకట్టుకునే విధంగా మలిచారన్నారు. ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక పూర్వ సంపాదకులు వల్లూరి రాఘవరావు, ఎ.పి.కాలేజీ ఆఫ్ జర్నలిజం కరస్పాండెంట్ గౌరీచందర్, అధ్యాపకులు ఎం. స్రవంత్ తదితరులు పరువుహత్యలపై వ్యంగ్య రచనలో ఎంత అద్భుతంగా నవలా రూపంలోకి తెచ్చారో సోదాహరణంగా విశ్లేషించారు.

నిమ్స్ ఆసుపత్రిలో ఏసీబీ మెరుపు దాడులు

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రికార్డులను పరిశీలిస్తుండగా.. మరోవైపు కాంటీన్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, సర్జికల్ స్టోర్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలో సుమారు పది మంది ఏసీబీ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఆసుపత్రికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలిస్తున్నారు. తనిఖీలకు గల పూర్తి కారణాలు, ఏయే అంశాలపై అధికారులు దృష్టి సారించారనే వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు నిమ్స్ ఆసుపత్రి కాంటీన్‌లో నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనల అమలును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఆసుపత్రిలోని సర్జికల్ స్టోర్‌లో నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. స్టోర్‌లోని మందులు, సర్జికల్ సామగ్రి నిల్వలు, సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నిమ్స్‌లోని మూడు విభాగాల్లో ఒకేసారి అధికారులు తనిఖీలు చేపట్టడంతో ఆసుపత్రి వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ తనిఖీల్లో ఏవైనా అవకతవకలు బయటపడ్డాయా? నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఉస్మానియా నూతన భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ (జనంసాక్షి) : నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్, గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల కింద ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి, తదుపరి చేపట్టాల్సిన పనులపై మంత్రి అధికారులతో చర్చించారు. గోషామహల్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని, నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ రెండు ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులు ముందుకు సాగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తూ, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యరంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని, కీలకమైన ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు వ్యవసాయమే ఆధారం

అన్నదాతలను సన్మానించడం సమాజానికి స్ఫూర్తిదాయకం

- యువత వ్యవసాయ రంగంవైపు అడుగులు వేస్తేనే నవీన భారత నిర్మాణం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి రూరల్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : మానవ మనుగడకు వ్యవసాయమే ఆధారమని, ప్రపంచంలో ఎన్ని రంగాలు అభివృద్ధి చెందినప్పటికీ మానవులతో పాటు సమస్త జీవరాశుల మనుగడకు ఆహారమే అత్యంత అవసరమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న అన్నదాతలను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్ సిటీలో వాయిస్ టివి (ఔఱఎవ ు.ఎ) అధినేత శ్రీమతి రాములమ్మ అలియాస్ రమ్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కిసాన్ మహారాజు అవార్డ్స్--2026' కార్యక్రమానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ రైతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.... రైతులను గుర్తించి గౌరవించే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సమాజంలో అందరికంటే ఎక్కువ ఆదరణ, గౌరవం పొందాల్సిన వారు రైతులేనని అన్నారు. భిన్న రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ ఉపాధి అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు మాత్రమే విస్తృత స్థాయిలో ఉపాధి కల్పించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని వివరించారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములు, సమృద్ధిగా సహజ వనరులు కలిగిన భారతదేశంలో వ్యవసాయ రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వ్యవసాయాన్ని వివిధ రూపాల్లో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు ఎన్ని వచ్చినా ఆహారం యొక్క ప్రాధాన్యత మాత్రం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేశారు.

యువత వ్యవసాయ నైపుణ్యాలను అలవర్చుకోవాలి

చదువుకున్న యువత వ్యవసాయ రంగంవైపు ఆకర్షితులై, ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ సాగులో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్య ద్వారా పొందిన విజ్ఞానాన్ని వ్యవసాయ నైపుణ్యాలకు జోడించి, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. యువత సంపూర్ణంగా వ్యవసాయ రంగం వైపు దృష్టి సారించినప్పుడే ఆధునిక, స్వావలంబన భారతదేశ నిర్మాణానికి బలమైన పునాది పడుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే దాని అనుబంధంగా ఉన్న అనేక రంగాలకు ఊతం లభిస్తుందని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధానాలను పాలకులు అమలు చేయాలని, రైతులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని అన్నారు. దేశ ప్రజలందరికీ ఆహారాన్ని అందిస్తూ సమాజ మనుగడకు పునాదిగా నిలుస్తున్న రైతులను సన్మానించడం గర్వకారణమని, అన్నదాతల సేవలను గుర్తించడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రైతులను గౌరవించే ఇటువంటి కార్యక్రమాలు వ్యవసాయ రంగం పట్ల సమాజంలో గౌరవభావాన్ని పెంపొందించడంతో పాటు యువతను వ్యవసాయం వైపు ప్రోత్సహించడానికి దోహదపడతాయని అన్నారు.

రూ.13.77 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం

యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) : జిల్లాలోని పోచంపల్లి మండలం రేవనపల్లిలోని శ్రీ విజయదుర్గ పీబీఆర్ఐ రైస్ మిల్లులో సీఎంఆర్ ధాన్యం మాయంపై అధికారులు కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 30న విజిలెన్స్ అధికారులు రైస్ మిల్లులో సోదాలు నిర్వహించి సుమారు 3,731.016 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.13.77 కోట్లుగా అంచనా వేశారు. తనిఖీల్లో నిల్వల వ్యత్యాసం గుర్తించిన జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దాచేపల్లి హరికృష్ణ మిల్లు భాగస్వాములపై భూదాన్ పోచంపల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు నమోదు చేశారు. మిల్లు భాగస్వాములుగా ఉన్న చిట్టిమల్ల శ్రీనివాస్, అర్థం అశోక్, మా శెట్టి కృష్ణమూర్తి, గార్లపాటి కృష్ణమూర్తి, చిట్టిమల్ల సువర్ణ, చిట్టిమల్ల లక్ష్మయ్య, గార్లపాటి భాను ప్రకాశ్, సోమ శ్రీనివాస్‌లపై పోచంపల్లి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370